హనీబీఏపి

మే - జూన్ 2013

# పల్లె సృజన

సంపుటి 1, సంచిక 6

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org



ఆంధ్రప్రదేశ్ మూలికా వైద్యులు

# సమాజ బాధ్యతలను మనం ఎప్పుడు నిర్వర్తిస్తాం

Saga of Star Fish : Do Individuals Matter ?



ఒక్కోసారి అనిపిస్తుంది "సమాజంనుంచి అన్ని లాభాలు పొందినవారే నిరాశావాదాన్ని బలపరుస్తున్నారేమో" అని. సమాజంలోని పెద్దమనుషులు (చాలామంది) ప్రపంచంలోని దిగజారుతున్న పరిస్థితులను చూసి తామొక్కరమే ఏమీ చేయలేమని అనుకుంటారు. వాళ్ళంతా వ్యక్తిగతంగా నిస్సహాయులమని నిర్ణయించుకున్నారు. కానీ ఇలా ఆలోచించని వ్యక్తి ఒకతను ఈ కథలో మనకి దర్శనమిస్తాడు.

ఒకరోజు ఒకతనికి సముద్రతీరంలో నడుస్తూ వుండగా, తీవ్రమైన సముద్రపు అలలచేత తీరానికి కొట్టుకు వచ్చిన అనేక నక్షత్ర చేపలు కనిపించాయి. పొడి నేలలో అవి నీరులేక తప్పనిసరిగా చనిపోతాయని జాలితో ఒక్కొక్క చేపనూ తీసుకువెళ్ళి సముద్రంలో పడవేసి రాసాగాడు. కొంత దూరంనుంచి ఇతన్ని గమనించిన ఒకామె "ఇలా ఎందుకు చేస్తున్నావు? ఇన్ని సముద్రపు చేపలు ఒడ్డున పడ్డాయి కదా, వీటన్నింటినీ నువ్వు సముద్రంలోకి చేర్చగలవా? అన్నింటినీ రక్షించగలవా? మీ చర్యలవల్ల ఎవరికేంటి లాభం?" అని అడిగింది. ఆమె చెప్పిందంతా శాంతంగా విని అతను తిరిగి ఒక చేపను తీసుకువెళ్ళి సముద్రంలో విడిచిపెడుతూ "నా చర్యలవలన ఎవరికి లాభమో నాకు తెలియదు కానీ, దీనికి మాత్రం చాలా లాభం" అన్నాడు.

**మనలో ఎంతమందిమి అలా చేస్తాం. సాధారణంగా మనమొక్కరమే ఏమీ చేయలేము అనుకుంటాము. కానీ, కనీసం ఒకరికైనా మేలు చేయగలం కదా? వ్యక్తులుగా సమాజంలో మన బాధ్యతని మనం చెయ్యాలి అని ఎప్పుడు నిర్ణయించుకుంటాం.**

– హనీబీ 6(1) 1995

NIF టోల్ ఫ్రీ నెంబర్
1800 233 5555

# పల్లెసృజన

సంపుటి-1 సంచిక - 6 మే - జూన్ 2013


## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్మలమడక శ్రీకర్



డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040– 40034392
సెల్ : 81257 99904
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27118555, 98660 01678
E-mail : editor@pallesrujana.org
www.pallesrujana.org


## ఈ సంచికలో...


- విశిష్ఠ రైతు పొన్నుస్వామి - 3
- లేజర్ కిరణాలతో దొంగతనాలకు చెక్ - 6
- మూలికా వైద్యుల సమావేశం - 7
- నాల్గు నాజిళ్ళ స్ప్రేయర్ - 14
- కొత్త రీతిలో మునగ అంట్లు పోసే మల్లిక - 15
- ఆ కాలంలో కాళ్ళకి చెప్పులు లేవు... – దీత్లీబెన్ - 17
- వెలుగులోకి రాని మహిళల సృజనాత్మకత - 19
- విస్మయం కలిగించిన మణిపూర్ శోధయాత్ర - 21
- ఔషధ మొక్కలు – ఉపయోగాలు - 26
- 'హనీబీఏపి' ప్రగతి - 29
- ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 30
- స్పందన - 31


**కవర్ లోపలి పేజీల్లో ....**


హనీబీ కథ :
సమాజ బాధ్యతలను మనం ఎప్పుడు నిర్వర్తిస్తాం?
హనీబీ నెట్‌వర్క్



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-1-282/19/1, St. No. 3, Chikkadpally, Hyderabad, Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# పల్లెజ్ఞానం

ఈ సంచికతో 'పల్లెసృజన' ఎనిమిదవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. మీ ఆదరణ, ప్రోత్సాహం, స్పందనలు మమ్మల్ని సునాయాసంగా ముందుకు నడిపిస్తున్నాయి. ఉత్తరాల రూపంలో మీ స్పందనలు తక్కువగా వచ్చినా, ఫోన్లద్వారా మీ అభిప్రాయాలు, విమర్శలు, సలహాలు విరివిగా అందుతున్నాయి. పత్రికను మరింత జ్ఞానభరితంగా చేయడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. భవిష్యత్తులో కూడా మీ సహకారం, సద్విమర్శలు మాకు సదా తోడుంటాయని మనసారా ఆశిస్తున్నాం.


"ఆంధ్రప్రదేశ్ మూలికా వైద్యుల సమావేశం" పల్లెసృజన ఆధ్వర్యంలో మే నెలలో జరిగింది. రెండు రోజులు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రం నలుమూలల నుండి అనుభవజ్ఞులైన మూలికా వైద్యులు పాల్గొన్నారు. ఆయుర్వేద డాక్టర్లు, వృక్ష శాస్త్రవేత్తలు, రీసర్చ్ స్కాలర్లు, అలోపతి డాక్టర్లు, ఎన్.జి.ఓ. ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని చర్చలను ఉత్కృష్ట స్థాయిలో జరిపారు. మూలికా వైద్యులు వారి మాటల్లో "ఎన్నడూ ఇంతమంది తోటి వైద్యులతో కలిసి చర్చించి, జ్ఞానాన్ని పంచుకునే అవకాశం మాకెన్నడూ కలగలేదు. ఈ సమావేశం మాకు ఇచ్చిన జ్ఞానంతో మేము ప్రజలకు ఉత్తమమైన వైద్యం అందించే అవకాశం లభించింది" అన్నారు. ఎన్.ఐ.ఎఫ్. ప్రతినిధులు మూలికా వైద్యుల అమోఘ జ్ఞాన సంపదకు నిశ్చేష్టులయ్యారు. అందులో ఆరు వైద్య పద్ధతులు ప్రపంచంలో లేవని ప్రాథమికంగా నిశ్చయించారు. వీటి పేటెంటుకై ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. మొత్తంమీద పల్లెసృజన చేపట్టిన ఈ కార్యక్రమం ఇంత విజయవంతంగా ముగిసినందుకు సమాజానికి, వైద్యులకు ప్రతిఫలం లభించినందుకు ఎంతో తృప్తిగా ఉంది. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలు జిల్లా స్థాయిలో జరగాలన్న ప్రతిపాదనను అందరూ అంగీకరించారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ప్రకృతితో, సామాన్య ప్రజలతో నిరంతర సంబంధం నెలకొలిపి సహజ జీవనంపై వారికి అవగాహన కల్పించాలన్న బలమైన కోరికను పలు విద్యావేత్తలు, విద్యా సంస్థల అధిపతులు వెలిబుచ్చారు. ఈ సందర్భంలో 'పల్లెసృజన' ఒక రోజంతా ఆరుగురు హైస్కూలు ప్రధానోపాధ్యాయులతో మేధోమథనం జరిపింది. ఈ దిశగా మరిన్ని చర్చలు వేరువేరు స్థాయిలో జరగాల్సి వుంది. 'ప్రకృతి - సమాజం' అన్న ఆలోచనను విద్యార్థుల జీవితాల్లో ఎలా ప్రవేశ పెట్టాలో త్వరలోనే ప్రతిపాదనలు తయారు చేయబడతాయి. వీటిని ఈ పాఠ్య సంవత్సరంలో కొన్ని పాఠశాలల్లో అమలు చేసి, దానివల్ల విద్యార్థులపై పడిన ప్రభావాన్ని గమనించాలనే నిర్ణయం జరిగింది. 'ప్రకృతి - సమాజం' ప్రతిపాదనపై పాఠకుల ఆలోచనలు, అభిప్రాయాలు, సలహాలను ఆహ్వానిస్తున్నాం.

పల్లెజ్ఞానం పదిమందికి చేరాలంటే మీరంతా తోడ్పడాలి. ప్రతి పాఠకుడు పదిమందిని 'పల్లెసృజన' సభ్యులుగా చేర్పించాలి. మీ అనుభవాలను, ప్రయోగాలను పల్లెసృజనలో ప్రచురణకై పంపించాలి. మీ సహకారాన్ని ఎల్లప్పుడూ కోరుకుంటూ....

**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం



**దూరదర్శన్, హైదరాబాద్ ప్రతినెల 4వ గురువారం రాత్రి 8 గంటలకు సప్తగిరి ఛానల్ లో 'సృజన' కార్యక్రమం ద్వారా గ్రామీణ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారు. పాఠకులంతా ఈ కార్యక్రమాన్ని తప్పకుండా చూసి మీ అభిప్రాయాలను మాకు తెలియజేయగలరు.**

## వినూత్న పరికరాల సృష్టితో కూలీల అవసరాన్ని తగ్గిస్తూ వ్యవసాయం చేస్తున్న

# విశిష్ట రైతు పొన్నుస్వామి



తమిళనాడు నుండి 15 సంవత్సరాల క్రితం వలస వచ్చిన రైతు పొన్నుస్వామి తన భార్యతో సహా మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి 5 కి.మీ. దూరంలో గల ముబారక్‌పూర్–బి గ్రామంలో నివసిస్తున్నారు.

తన వ్యవసాయానికి ఏ రకమైన పరికరం కావాలో ఆలోచించి, నాకు ఈ పరికరం ఇలా కావాలి అని పొన్నుస్వామి చెపితే దాన్ని ఆచరణలో పెట్టే 'ఆది నారాయణ' సంగారెడ్డిలో ట్రాక్టర్ల పనిముట్లు తయారు చేసే దుకాణదారుడు. వీరిద్దరి సాంగత్యం, క్రియాశీలత ఎన్నో వినూత్న వ్యవసాయ పరికరాలకు దారి తీసింది.

పొన్నుస్వామి ఈమధ్యనే ట్రాక్టరుకు అనుసంధానం చేసే ఒక నాగలి తయారు చేయించాడు. దాన్ని ఉపయోగించి దాదాపు రెండున్నర అడుగులు లోతు వరకు దున్నడం, దాదాపు మూడు అడుగుల వెడల్పు వరకు భూమి వదులుగా తయారవటం చూస్తే ఆశ్చర్యం వేసింది. మామూలుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన నాగలి ఒకటిన్నర అడుగుల లోతు దుక్కి దున్నినా అది కూడా కేవలం ఒక గీత మాదిరిగా దున్నుకుంటూ వెళుతుందని, కానీ, ఈ నాగలితో దున్నటం వలన భూమి బాగా పెళ్ళగించుకుని దున్నుతుందంటాడు పొన్నుస్వామి. ఇంత లోతు దుక్కి దున్నటం అవసరమా? అని అడగగా, ఇలా దున్నటం వలన తక్కువ ఖర్చుతో అరటి, బొప్పాయి లాంటి తోటలు పెట్టేందుకు అవసరమైన బోదెలను చాలా తక్కువ ఖర్చుతో చేయవచ్చు. మామూలు సేద్యం ద్వారా ఒకసారి నాగలితో దున్ని, తర్వాత కల్టివేటర్ ద్వారా ఆ పొలాన్ని మెత్తగా తయారు చేయటానికి దాదాపు ఎకరాకు 30 లీటర్ల డీజిల్ ఖర్చయితే తన పద్ధతి ద్వారా కేవలం 5 నుండి 6 లీటర్ల డీజిల్‌తోనే బోదెలు తయారవుతాయని అంటున్నారు. ఈ నాగలి తయారు చేయటానికి దాదాపు 16 వేల రూపాయల దాకా ఖర్చవుతుంది.

అరటి పొలంలో కానీ మరే అవసరానికైనా కానీ పొలంలో పెద్ద కాలువ తీయాలంటే ఎంతోమంది కూలీలు అవసరం. కానీ పొన్నుస్వామి తయారు చేయించిన ఈ నాగలి ద్వారా తక్కువ ఖర్చుతో తొందరగా అవసరమైన కాలువ తయారౌతుంది. చెఱకు, అరటి తోటలకు



అవసరమైన పొలాన్ని కాలువల కోసం మొత్తం దున్నుకోకుండా కాలువ అవసరమైన చోట మాత్రమే ఈ నాగలితో దున్నుకుంటారు. ఈ నాగలిలో మరో సౌకర్యం కూడా కల్పించాడు పొన్నుస్వామి. భూమి దున్నిన తర్వాత ఆ మట్టి బైట వైపుకు (కాలువలా) రావాలంటే ఈ నాగలికి తనకు కాలువ ఎంతమేర అవసరమౌతుందో దానికి తగిన ఒక ప్లేటును నాగలికి తగిలించడం ద్వారా వెంటనే కాలువ తయారవుతుంది. మట్టి బైటకు పడవలసిన అవసరం లేదు, కానీ భూమి లోపలే వదులు కావాలి అనుకుంటే ప్లేటు లేకుండా పొలాన్ని దున్నుతాడు. ఇందుకై తాను 50 హార్స్‌పవర్ సామర్థ్యం గల ట్రాక్టరును ఉపయోగిస్తాడు. దీనిని 'సింగల్ నాగలి' అని పిలుస్తాడతను.

బోదెలు తయారు చేయటానికి మరో పరికరాన్ని తయారు చేయించాడు దాన్ని 'రిడ్జర్' అని అంటారు. ఈ పరికరం చేసే పనులు కాలువ తయారు చేయటం, బోదెలు తయారు చేయటం. ఈ రిడ్జర్ తయారుచేయటానికి దాదాపు 24 వేల రూపాయల దాకా ఖర్చవుతుంది.

చామగడ్డ, పసుపు, ఆలుగడ్డ, అల్లం లాంటి వాటిని భూమినుండి వెలికి తీయటం చాలా సులువుగా తక్కువ ఖర్చుతో పని జరిగేలా తయారు చేయించాడు. మామూలు నాగలి భూమిని పెల్లలుగా పైకి లేపుతుందని, ఈ నాగలితో దున్నటం ద్వారా భూమి పెల్లలుగా కాకుండా మెత్తగా తయారవుతుందని అంటారు.

ఈ నాగలి తాను ఎందుకు తయారు చేసుకున్నాడని అడగగా, చదువుకున్న శాస్త్రవేత్తలు కేవలం పుస్తకాలకే పరిమితమై చాలా వ్యవసాయ పరికరాలు చేస్తున్నారని, కానీ, అవి రైతుకు ఎంతవరకు ఉపయోగకరమో అన్న విషయాన్ని పట్టించుకోవటం లేదని అంటారు పొన్నుస్వామి. ఈ నాగలితో పొలం దున్నిన తర్వాత తాను తయారు చేయించిన 'రిడ్జర్' అనే పనిముట్టను ఉపయోగించి బోదెలు, కాలువలు చేసుకుంటాడు.

దాదాపు 50 ఎకరాలలో అరటి, చెఱకు, బొప్పాయి పంటలను సాగుచేస్తున్న పొన్నుస్వామికి దాదాపు ప్రతిరోజూ 5 లేక 6 మంది కూలీల సహాయంతో మాత్రమే 50 ఎకరాలలో వ్యవసాయం చేస్తాడు. వీలైనంత వరకు కూలీల ఖర్చు లేకుండా వ్యవసాయం చేస్తానంటాడు పొన్నుస్వామి.

ఇక పంటలకు ఎరువుల విషయానికి వస్తే కోడి ఎరువును (కోడి పెంట) తీసుకుని దాన్ని మొదట 'డీ-కంపోజ్' చేస్తాడు. 10 కేజీల కోడి పెంటను గానీ, పశువుల పేడ ఎరువు గానీ నేరుగా పొలంలో వేస్తే అది భూమిలో డీ కంపోజ్ అయి ఆహారంగా మొక్కకు అందడానికి మూడు నుంచి నాలుగు నెలలు పడుతుంది. అంటే మనం పొలంలో ఎరువు వేస్తే అది ఆహారంగా తయారవటానికి మూడు నెలలు గడుస్తుంది. ఉదా. అరటి పంట 7 నెలలయితే 3 నెలల కాలం వరకు దానికి ఆహారం అందదు ఆ తర్వాత 6వ నెల నుండి మొక్క ముసలితనం వస్తుంది కాబట్టి అప్పుడు ఆహారం తీసుకోలేదు అంటాడు. కాబట్టి ఎరువును డీ కంపోజ్ చేసి మొక్కకు నేరుగా, వెంటనే ఆహారం అందేలా డ్రిప్ ద్వారా అందిస్తే మనం 10 టన్నుల ఎరువు వేసే చోట కేవలం 5 టన్నుల ఎరువును అందిస్తే దాన్ని మొక్క నేరుగా ఆహారంగా తయారు చేసుకుని ఆరోగ్యంగా, ఏపుగా పెరుగుతాయి అంటాడు పొన్నుస్వామి.

ఈ ఎరువును డీ కంపోజ్ చేసిన తర్వాత, డ్రమ్ములలో నీటిని నింపి వాటిలో డీ కంపోజ్ అయిన ఎరువును ఒక డ్రమ్ముకు 15 కిలోల చొప్పున 10 రోజుల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత ఆ నీటిని మరో చిన్న (1 హెచ్.పి.) మోటారు ఫుట్‌వాల్వ్‌కు 120 మెటల్ మెష్‌ను తగిలించి, మోటారు ద్వారా డ్రిప్ ఫిల్టర్‌లో ఈ నీరు కలిసేలా





ఏర్పాటు చేశాడు. అలా చేయటం వల్ల డ్రిప్ ద్వారా మొక్కకు నేరుగా ఆహారం అందుతుందని ఆయన నమ్ముతారు.

రసాయన ఎరువులు కూడా వేయవచ్చు కానీ అవి మోతాదు మించకుండా వేస్తే భూమికి ఎలాంటి ఆపదా లేదంటాడు పొన్నుస్వామి. కొందరు రైతులు అత్యధిక రసాయనిక ఎరువులు వేయటం వల్ల భూమిని నిస్సారంగా చేస్తున్నారని అంటాడు. మొదట్లో పూర్వీకులు కేవలం సేంద్రియ వ్యవసాయం చేసేవారని, వాటివల్ల దిగుబడి ఎకరాకు 10-15 బస్తాలు వచ్చేవని, ఈ రసాయనిక ఎరువులు వచ్చిన కొత్తలో అతి తక్కువ మోతాదులో వేయటం వల్ల ఆ దిగుబడి కాస్తా 40 బస్తాలకు పెరిగింది. ఇదేదో బావుంది కదా అనుకుని దిగుబడి ఇంకా పెరగాలన్న ఉద్దేశ్యంతో రసాయనిక ఎరువులను మోతాదు పెంచటం ద్వారా భూమి సేంద్రియ ఎరువులను వాడుకోలేని స్థితికి చేరుకుని దిగుబడి ప్రస్తుతం 25 బస్తాల వరకు కూడా పడిపోయింది. అంటే మొదట్లో కొద్దిగా వేయటం వల్ల దిగుబడి పెరిగింది, ప్రస్తుతం ఎరువుల మోతాదు పెంచటం వల్ల దిగుబడి తగ్గింది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే, రైతుకు పెరుగుతున్న ఎరువుల ఖర్చుతో, దిగుబడి పెరుగదు.

కాబట్టి మోతాదు మించి రసాయనాలు వేయకుండా పంటకు కావలసిన మోతాదును మాత్రమే కొద్ది కొద్దిగా అందిస్తే వాటిని భూమి సంతృప్తికరంగా స్వీకరించి, మంచి దిగుబడిని ఇస్తుంది అంటారు పొన్నుస్వామి.

ఇక హార్టికల్చర్ (ఉద్యాన వనాలు) విషయానికి వచ్చినపుడు చెట్లను ప్రూనింగ్ చేయటం పొన్నుస్వామికి ఇష్టం వుండదు. దానివల్ల పంట దిగుబడి పెరుగుతుంది అంటే ఒప్పుకోడతను. చెట్టు ఎక్కువగా పెరగకుండా పైనున్న సుడికొమ్మను కత్తిరించండి కానీ, వచ్చిన ప్రతి కొత్త లాకనూ కత్తిరించుకుంటూ పోతే ఎలా అంటాడు. ఒక చెట్టుకు భూమిని ఆనుకుని ఒకటి లేదా ఒకటిన్నర అడుగుల వరకు ఎలాంటి రెమ్మలు లేకుండా కత్తిరించండి, ఎందుకంటే వాటివల్ల భూమిపైన చెట్టు మొదలు వద్ద ఎరువులు వేయటానికి, కలుపు తీయటానికి అడ్డంగా వుండకుండా వుంటుంది. చెట్లు పూర్తిగా ఎత్తు పెరగకుండా చిటారు కొమ్మలను తుంచండి. ఎందుకంటే చెట్టు ఎత్తు ఎక్కువైతే పండ్లను కోయటానికి కూలీల భారం పెరుగుతుంది కాబట్టి అంటాడు పొన్నుస్వామి.

రైతులకు విద్యుత్ వాడకం తగ్గించాలంటే మోటారు స్టార్ట్ చేయటానికి మాత్రమే విద్యుత్తును వాడి, ఆ తర్వాత ఆ మోటార్ ద్వారా పారే నీటిశక్తితో మోటారు నడిపగలిగితే చాలా లాభకరంగా ఉంటుందని విశ్వసిస్తూ పొన్నుస్వామి ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశోధన నిపుణులు, కళాశాలలు చేపట్టాలని ఆశించారు.

తన వ్యవసాయంలో కొత్త పోకడలను ఇనుమడిస్తూ లాభదాయక వ్యవసాయం చేస్తున్న పొన్నుస్వామికి సంగారెడ్డి లోని ఒక వర్క్‌షాపు యజమాని 30 సంవత్సరాల ఆది నారాయణ సహకరిస్తున్నారు. పొన్నుస్వామి అవసరాలకు, ఆలోచనలకు అనుగుణంగా సేద్యపు పనిముట్లను తయారు చేస్తాడు. ఎంతో నైపుణ్యంతో ఆదినారాయణ ఈ వినూత్న పరికరాలను తయారు చేసి ఎంతోమంది రైతుల మెప్పును పొందాడు. పొన్నుస్వామికి అవసరమైన పనిముట్లను అన్నింటినీ తానే తయారు చేశాననీ, వాటిని పొలంలో వాడి, అవసరమైన మార్పులు చేర్పులు చేసి, రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది అని నిర్ధారించుకున్న తర్వాత ఇతర రైతులకు ఈ పరికరాలను చేసి ఇస్తాను అంటారు ఆదినారాయణ.

**వివరాలకు పొన్నుస్వామి ఫోన్ నెం : 94949 82306**

**ఆదినారాయణ ఫోన్ : 99089 04369,**

**పొన్నుస్వామి, ఆదినారాయణ ఒక రైతు – మెకానిక్ జంట గత కొన్ని సంవత్సరాలుగా కూలీల అవసరాన్ని తగ్గించే పరికరాలను క్రియాశీలతతో తయారు చేసి, వాటిని విజయవంతంగా వ్యవసాయంలో వినియోగించి, ఈ జ్ఞానాన్ని (పనిముట్లను) ఇతర రైతులకు తమ శాయశక్తులా అందజేస్తున్నారు. వీరి శ్రమకు, క్రియాశీలతకు 'పల్లెసృజన' అభినందనలు. ఇలాంటి వినూత్న ప్రయోగాలను రైతులందరికీ తెలిసేట్టుగా చేయటం సమాజం బాధ్యత. 'పల్లెసృజన' దీనికై పాటు పడుతుంది.**

# లేజర్ కిరణాలతో దొంగతనాలకు చెక్

## ముప్పారపు రాజు ఇన్నోవేషన్

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన ముప్పారపు రాజు హనీబీఎపి వాలంటీరుగానే కాదు, ఇన్నోవేటర్‌గా కూడా పల్లెసృజన పాఠకులకు పరిచయమే. రోజురోజుకూ పెరుగుతున్న దొంగతనాలకు ఏదైనా కొంత విరుగుడు కనిపెట్టాలని ఆలోచించాడు. తనకు వచ్చిన ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చాడు. దొంగతనాలను అరికట్టాలన్న ఒకే ఒక ఉద్దేశ్యంతో లేజర్ కిరణాలను ఉపయోగించి ఈ పరికరాన్ని తయారు చేశాడు రాజు. ఈ పరికరంతో దొంగలను ఇట్టే పట్టేయవచ్చు అన్న ధీమాను వ్యక్తం చేశాడతను.

ఈ పరికరాన్ని ఇంటి ముఖద్వారం ఎదురుగా గది లోపల అమర్చుకోవాలి. ఇంటి యజమానులు బయటకు వెళ్ళే సమయంలో ఈ పరికరాన్ని ఆన్ చేసుకుని వెళ్ళాలి. ఆ సమయంలో ఎవరైనా అగంతకులు ఇంటిలోకి చొరబడ్డపుడు ఈ పరికరం వెంటనే వారి మొబైల్‌కు కాల్ చేస్తుంది.

ఈ పరికరం శరీర కదలికల ఆధారంగా పని చేస్తుంది. ఈ పరికరం నుండి ఫోన్ కాల్ రాగానే మన ఇంట్లో ఎవరో వ్యక్తులు చొరబడ్డట్టు గుర్తించి వెంటనే అప్రమత్తం కావచ్చు. ఇదంతా కేవలం 30 సెకండ్ల వ్యవధిలో జరుగుతుంది. దీనితో మనం అప్రమత్తమై వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు.



రాజుతయారు చేసిన ఈ పరికరాన్ని చూసిన స్థానికులు ముప్పారపు రాజును అభినందిస్తూ కొన్ని పరికరాలను తయారు చేయటానికి అడ్వాన్సు ఇచ్చారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా దొంగ తనాలు పెరిగి పోవటం తో ఈ పరికరం యొక్క ఉపయోగం ప్రజలకు చాలా అవసరమని అనేక మంది రాజును కొనియాడారు.

దీని విలువ సుమారు రూ. 4,500 వరకు వుంటుంది. ఈ పరికరాన్ని ఉపయోగించి మీ విలువైన వస్తువులను కాపాడుకోవచ్చు. మీరు ఇల్లు విడిచి ప్రశాంతంగా బయటికి వెళ్ళి రావచ్చు. విలైవైన వస్తువుల, అభరణాలు ఇంట్లో పెట్టుకోవడానికి వీలుపడుతుంది కూడా. ఈ పరికరం కావలసిన వారు :

**ఇన్నోవేటర్ రాజు** ఫోన్ నెం ; 950 28 55858 లో సంప్రదించి పరికరాన్ని పొందవచ్చు.





# మూలికా వైద్యుల సమావేశం-2013



'వైద్యో నారాయణో హరి' అన్నారు పూర్వులు. వైద్యుడు అన్నవాడు దేవుడితో సమానం. ఆ వైద్యుడు ఏవిధమైన వైద్య పద్ధతి వాడినా రోగికి వచ్చిన రుగ్మతని తగ్గించటమే ప్రధానం. దేశంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో మూలికా వైద్యాన్ని ఆచరించటం అన్నది ఆదిలాబాద్, ఖమ్మం, తూర్పు గోదావరి, విశాఖపట్టణం, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో బాగా కనిపిస్తుంది. ప్రకృతిసిద్ధమైన వీరి వైద్య విధానం ఒక్కొక్కప్పుడు మన సనాతన ఆయుర్వేదానికి కూడా అంతుపట్టదు. వీరు అనేక జబ్బులకి సులభ రీతిలో అందుబాటులో వున్న మూలికలతో వైద్యం అందిస్తూ వుంటారు. వీరు వాడే వైద్య విధానాన్ని తెలుసుకొని గ్రంథస్థం చేయాలని పల్లెసృజన, ఎన్.ఐ.ఎఫ్. వారు చేసిన ప్రయత్నమే ఈ 'మూలికావైద్యుల సమావేశం – 2013'.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మూలికా వైద్యాన్ని అందజేస్తున్న, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలకి చెందిన వైద్యులని ఒక్కచోటికి చేర్చి, వారు ఆచరించే పద్ధతులని ఒకరికొకరు తెలుసుకునే అవకాశం కల్పించి, వాటిని స్థిరీకరించటం ఈ సదస్సు ధ్యేయం. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యాలు :

1. రాష్ట్రంలోని నలుమూలల్లో వున్న గిరిజన ప్రాంతాల్లోని మూలికా వైద్యులకు ఒక వేదిక కల్పించటము.
2. వారి వారి ప్రాంతాలలో ప్రబలివున్న పది వ్యాధులని గుర్తించి, ఆ వ్యాధుల (మానవులకి, పశువులకి) నివారణకి మూలికా వైద్యులు వాడే పద్ధతులని చర్చించడం. ఆ పద్ధతులని స్థిరీకరించే ప్రయత్నం చేయటం.
4. అంతరించిపోతున్న అరుదైన వనమూలికలని గుర్తించటం.
5. ఈ వైద్యులు వాడే వనమూలికల పేర్లను వీలైనన్ని సేకరించి వాటిని గ్రంథస్థం చేయటం.
6. వీరి వైద్య పద్ధతులని సంబంధిత సంస్థలచే పరీక్షింపజేసి ప్రామాణికం చేయటం.
7. ఉత్తరోత్ర తెలుగు వైద్యం పేరిట ప్రమాణించిన వైద్య పద్ధతులకు ప్రాచుర్యం కల్పించటం.

ఎన్.ఐ.ఎఫ్., హనీబీ, పల్లెసృజన సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య నిష్ణాతుల సమక్షంలో




పి. ఉమా మహేశ్వర రావు

ఆంధ్రప్రదేశ్ లోని సుదూర ప్రాంతాల నుండి వచ్చిన 30 మంది మూలికా వైద్యులు తమతమ అనుభవాలను పంచుకునేందుకు 2013 మే, 24, 25 తేదీలలో హైదరాబాద్ తార్నాక ప్రాంతంలోని సెయింట్ ఆన్స్ జనరలేటి ఆవరణలో జరిగిన సమావేశానికి హాజరైనారు. ఎన్.ఐ.ఎఫ్. తరుపున డా. వివేక్, డా. విపిన్ కుమార్, అతని బృందం హాజరయ్యారు.

బ్రిగేడియర్ గణేశం తన స్వాగతోపన్యాసంలో ఈ సదస్సు ఆవశ్యకతను వివరిస్తూ ముందుగా ఎన్.ఐ.ఎఫ్., హనీబీ, పల్లెసృజన చేసే పనులను, వాటి స్థాపన వెనుక గల ఆవశ్యకతను తెలిపారు. ఆదివాసి గ్రామాలలో మూలికా వైద్య సాంప్రదాయం ఒక తరం నుండి మరో తరానికి చేరక, అక్కడే అంతరించి పోతోందని దానివలన రాబోయే తరాల వారికి ఈ జ్ఞానాన్ని అందించలేమనే ఆవేదనతో ఈ మూలికా వైద్యుల సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఇలా అంతరించి పోతున్న జ్ఞానాన్ని వెలికి తీసి, ప్రామాణీకరించి, గ్రంథస్థం చేసి, 'తెలుగు వైద్యం' పేరిట ఒక పుస్తకరూపం లో వెలువరించాలనే ప్రయత్నానికి ఈ సదస్సు నాంది కావాలని అన్నారు.

ఈ సదస్సులో చర్చించటానికి 12 వ్యాధులని గుర్తించామని, మూలికా వైద్యులు తమతమ ప్రాంతాలలో ఈ వ్యాధులకి చేస్తున్న వైద్య విధానాలను, వాడుతున్న మూలికలను, ఔషధాన్ని తయారు చేసే విధానాన్ని, వాడే మోతాదులను వివరించాలని కోరారు. ఇలా ఒక్కో వ్యాధి నివారణ, తగ్గించే ప్రక్రియలను గ్రంథస్థం చేసి, అందులో ఉత్తమమైన ప్రక్రియలను ఎంపిక చేసి, ఆ జ్ఞానకర్తను గుర్తించి, అతని జ్ఞానానికి పేటెంటు, రాయల్టీ దక్కే విధంగా చర్యలు తీసుకోవాలనేదే ఈ సమావేశ ధ్యేయం అన్నారు.

డా. వివేక్ మాట్లాడుతూ హనీబీ నెట్‌వర్క్ 1989లో చిన్న సమాచార సేకరణ నెట్‌వర్క్‌గా ఆవిర్భవించి నేడు దేశమంతటా విస్తరించి, ఎందరో వాలంటీర్లను అందులో చేర్చుకుంటూ మొదట "సృష్టి", తరువాత "జ్ఞాన్" సంస్థలను ప్రారంభించింది. ఈ నెట్‌వర్క్ చేస్తున్న అమోఘమైన పనికి సంస్థాగతంగా ప్రభుత్వం ఊతమందివ్వటానికి 2000 సంవత్సరంలో ఎన్.ఐ.ఎఫ్., భారత ప్రభుత్వం ద్వారా ప్రారంభించబడిందని అన్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించి పోతున్న సాంప్రదాయ జ్ఞానాన్ని మార్కెట్‌లోకి తీసుకువచ్చి, అందరికీ అందుబాటులో వుండే విధంగా సహకరించాలన్నదే ఎన్.ఐ.ఎఫ్. ఉద్దేశ్యమని "మెదడు నుండి మార్కెట్ వరకు" అన్నదే మా నినాదమని అన్నారు.

ప్రారంభోపన్యాసం తరువాత సదస్సుకు హాజరైన వైద్యులు ఒక్కొక్క వ్యాధి గురించి తమ వివరణలు అందించారు. సదస్సులో మధుమేహం, మలేరియా, కీళ్ళ నొప్పులు, చర్మవ్యాధులు, సోరియాసిస్, ఉబ్బసం, హైపర్‌టెన్షన్ తదితర వ్యాధుల లక్షణాలు, వైద్య విధానం, వాటికి వాడే మూలికల గురించి చర్చించడం జరిగింది.


కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా మూలికా వైద్యులు శ్రీ ఉమామహేశ్వర రావు గారి అనుభవాలు నిలిచాయి. ఒక ఎల్.ఐ.సి. ఏజెంట్‌గా వుంటూ, మూలికా వైద్యాన్ని 22 సంవత్సరాలుగా చేస్తూ, అలాగే 4,500 లకు పైగా మొక్కలను పెంచుతూ, 1500లకు పైగా మొక్కలను వ్యాధుల నివారణకు వాడుతున్న శ్రీ ఉమామహేశ్వర రావుగారు ఖమ్మం జిల్లా మణుగూరు వాసి. వీరు తమ అనుభవాన్ని ఈ సదస్సులో అందరితో పంచుకున్నారు.



వైద్య విశేషజ్ఞులు శ్రీ రామమూర్తి గారు (చీరాల), శ్రీ పమ్మి సత్యనారాయణ శాస్త్రి గారు (విజయవాడ), డా. కవిత (గుంటూరు), శ్రీ వెంకటేశ్వర శర్మ (హైదరాబాద్) గార్లు మూలికా వైద్యులు చెప్పినవి హనీబీ ప్రతినిధులకు ఆంగ్లం మరియు వృక్షశాస్త్ర పరిధిలోకి అనువదించి చెప్పటంలో సహకరించారు.

రెండవ రోజు (25వ తేదీన) సదస్సుకొనసాగిస్తూ ఎన్.ఐ.ఎఫ్. తరుపున సమావేశానికి హాజరైన డా. విపిన్ మాట్లాడుతూ "తరతరాల నుంచి వున్న ఆయుర్వేదం అనేక కారణాల వల్ల అందరికీ అందుబాటులో లేకుండా పోతోంది. మీరు దేశంలోని మారుమూల ప్రాంతాలలో సాంప్రదాయ జ్ఞానానికి మీ అనుభవాన్ని జోడించి అనేక వ్యాధులకి మూలికా వైద్యం చేస్తున్నారు. మీ జ్ఞానం, అనుభవం మీ ప్రాంతానికే పరిమితం కాకుండా దానికి తగిన స్థాయిలో ప్రాచుర్యం కల్పించటానికి మేము ఎన్.ఐ.ఎఫ్. తరుపున ప్రయత్నం చేస్తున్నామని, దానికి పల్లెసృజనతో కలిసి ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలియజేశారు.

రాష్ట్రంలో టి.బి. వ్యాధిగ్రస్తులు కూడా బాగానే వున్నారు. మరి వారికి కూడా మూలికా వైద్యం చేయగలిగితే మూలికావైద్యుల పేరు ప్రఖ్యాతులు ఇంకా మంచి పేరు గడిస్తారని గణేశం గారు అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉమా మహేశ్వర రావుగారు తాను క్షయ వ్యాధికి మందు తయారు చేయడమైనదని, కానీ ఇంకా పరిపూర్ణంగా



యస్. సమ్మయ్య

పరీక్షించబడలేదని ఈ సమావేశానికి హాజరైన వైద్యులందరికీ తాను తయారు చేసిన మందు చెబుతానని, వారు కూడా వారి వారి ప్రాంతాలలో దీన్ని ప్రయోగించి, అవసరమైతే ఇంకా దానికి ఏవైనా మూలికలు చేర్చి ప్రయోగాత్మకంగా విజయవంతం చేయాలని ఆశించి తాను తయారు చేసిన మందు వివరాలను వెల్లడించగా, ఆ వైద్యాన్ని అందరు మూలికా వైద్యులు తమతమ గ్రామాల్లోని క్షయ వ్యాధి గ్రస్తులకు అందించి, వాటి ఫలితాలను తప్పకుండా 'పల్లెసృజన'కు తెలియజేయాలని బ్రిగేడియర్ గణేశం గారు విజ్ఞప్తి చేశారు.

తరువాత స్థూలకాయం, బోదకాలు, కళ్ళకు సంబంధించిన వ్యాధులు, పచ్చకామెర్లు, మూర్ఛ లాంటి వ్యాధులకి వేరు వేరు ప్రాంతాల్లో వేర్వేరు వైద్యులు తాము ఉపయోగించే పద్ధతులు, మూలికలు, మోతాదుల గురించి





బి. మోహన్ రెడ్డి



సవివరంగా చెప్పడం జరిగింది.

సమావేశానికి హాజరైన వైద్యులందరూ తమకు తెలిసిన వైద్యాన్ని వివరించగా డా. వివేక్ బృందం వాటిని గ్రంథస్థం చేయడం జరిగింది.

శాస్త్రి గారు సమావేశానికి వచ్చిన వైద్యులు చెప్పే మూలికల పేర్లకు శాస్త్రీయ నామాలు, రాష్ట్రంలో గల ఇతర పేర్లను వివరిస్తూ తమ అమూల్య జ్ఞానాన్ని పంచుకోవడం వల్ల ఎన్.ఐ.ఎఫ్. బృందం ఈ వైద్యాలను గ్రంథస్థం చేయ గలిగారు.

కార్యక్రమ ముగింపులో బ్రిగేడియర్ గణేశం మాట్లాడుతూ ప్రకృతిలో మన చుట్టూ చాలా జ్ఞానం దాగుందని ఆ జ్ఞానం గ్రామీణులకు తెలిసినంతగా పట్టణ వాసులకు తెలియదని, ప్రకృతితో మమేకమై జీవిస్తున్న మీకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని సమావేశానికి వచ్చిన గ్రామీణ మూలికా వైద్యులతో అన్నారు. మీకు తెలిసిన జ్ఞానాన్ని పదిమందికి తెలియజేసి దాన్ని వెలుగులోకి తీసుకు రావటమే ధ్యేయంగా ఈ రెండురోజుల సమావేశం ఏర్పాటు చేయడమైనది అన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ఇదే అయినా కార్యక్రమానికి విచ్చేసిన మూలికా వైద్యులు అందరూ ఒకచోట చేరి మీలో మీరు చర్చించుకుంటే ఇంకా మెరుగైన వైద్యం ప్రపంచానికి అందుతుందని, ఇలా మాట్లాడుకోవటం ద్వారా ఒకరికి తెలిసిన విషయాలు మరొకరికి తెలియ జేసుకోవటం వల్ల సమాజానికి ఇంకా ఎంతో మేలు చేకూరుతుందన్న ఈ సమావేశ ఉద్దేశ్యం నేరవేరిందన్నారు.

అంతేకాక, ఒక్కో ప్రాంతంలో ఒక్కో చెట్టు లేదా మూలికలు లభిస్తాయని, అవి మరో ప్రాంతంలో లభించక పోవచ్చని, ఈ విషయాలు మీలో మీరు మాట్లాడుకుంటే కావలసిన మూలికలను మీకు మీరే సమకూర్చుకోగలరని అన్నారు. ఇంతకుముందు మీరు ఒక్కో ప్రాంతానికి పరిమితమయ్యారు కానీ, ఈ సమావేశం ద్వారా ఒక్కటవ్వటంతో మీమధ్య పరిచయాలు పెరిగి, మీకు అవసరమైన మూలికలను ఒకరి నొకరు ఫోన్‌ల ద్వారా తెప్పించుకునే అవకాశం కలిగిందని ఆశిస్తున్నాను అన్నారు.

ముఖ్యమైన విషయమేమిటంటే ఎన్.ఐ.ఎఫ్. నుంచి ఈ సమావేశానికి వచ్చిన సైంటిస్టులకి వారు ఇంతవరకు





పూజారి లోలిత్



ఇ. మల్లయ్య



యస్. నాగులు

చూడనటువంటి కొన్ని వైద్యాలను, మూలికలను తాము చూశామనటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. వీటిని తీసుకువెళ్ళి ప్రయోగ శాలల్లో పరీక్షలు జరిపి వాటిని ప్రమాణీకరించి మీకు తెలియజేయటం జరుగుతుందని, ఆ తర్వాత మీరు చేస్తున్న మందును సమాజానికి అందజేసే ఏర్పాటు చేస్తారని అన్నారు. ఇందువల్ల 'పల్లెసృజన'కు మీ ద్వారా విశేషమైన జ్ఞానం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రిగారు, రావుగారు, రామ్మూర్తి గారి లాంటి ఎంతోమంది నిష్ణాతులు ఈ సమావేశంలో పాల్గొనటం ద్వారా వైద్యులకు వారు వినియోగిస్తున్న మూలికల శాస్త్రీయ నామాలు తెలియటంతో పాటు మొక్కలపై ఇంకా మంచి అవగాహన పెరిగింది అనుకుంటున్నానన్నారు. దీనికి సమావేశానికి హాజరైన అందరూ ఒప్పుకున్నారు. ఇలా జ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకోవటం ద్వారా ఇంకా ఎంతో మందికి మేలు జరుగుతుందని, మీ వైద్యానికి ఇంకా మంచి పేరు వచ్చే అవకాశమూ వుందని అన్నారు. శ్రీ విపిన్ గారు చెప్పినట్లు ఈ జ్ఞానాన్ని దేశంలోని ప్రతి మనిషి దగ్గరికి చేర్చాలని ఆశిస్తున్నామన్నారు.


సమావేశానికి హాజరైన వైద్యులను సన్మానించటం జరిగింది. వైద్యులు ఎ. గంగన్న, పి. ఉమా మహేశ్వర రావు, కె. సోమన్న, యస్. భీమన్న, యస్. నాగేశ్వర రావు, పి. ఐలయ్య, పూజారి లోలిత్, బి. కుమార స్వామి, బి. మోహన్ రెడ్డి, యస్. సమ్మయ్య, పి. దశరథం, ఇ. మల్లయ్య, ఎ. ప్రకాష్, యస్. నాగులు, పి. సాన్య, కె. గోపాల్ రావు, యస్. ప్రసాద్, జి. రామన్న, పి. సోమయ్య, ఎ. సన్యాసిరావులను సన్మానించారు.

సమావేశానికి ఎన్.ఐ.ఎఫ్. తరుపున డా. వివేక్, డా. విపిన్ గారలు విచ్చేసి సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు బ్రిగేడియర్ గణేశం. పల్లెసృజన స్కౌట్ సభ్యులు రాజు, అనిల్‌లను ప్రత్యేకంగా అభినందిస్తూ వీరిద్దరి కృషి వల్లే ఇంతమంది వైద్యులు ఇక్కడికి రాగలిగారని అన్నారు. డా. విపిన్ వారిని సత్కరించారు. ఎన్ఐఎఫ్ పల్లెసృజన ఏ కార్యక్రమం చేసినా స్కౌట్ల పనితీరుపైనే ఆధారపడి వుంటుందని, గ్రామాల్లో వీరి ప్రాతినిథ్యం వల్లే ఇటువంటి కార్యక్రమాలు జరుగుతాయని


పి. సోమ్యా



పి. దశరథం




యస్. ప్రసాద్




జి. రామన్న

అన్నారు. ఇంకా సమావేశానికి హాజరు కాని మూలికా వైద్యులతో ఇక్కడికి వచ్చిన వైద్యులు చర్చించి ఈ సమావేశానికి రావటం వల్ల మీరు పొందిన అనుభూతిని వివరించాలని, వారిని కూడా 'పల్లెసృజన' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయాలని, తద్వారా మీ జ్ఞానాన్ని దేశవ్యాప్తంగా పంచవచ్చనే అభిప్రాయాన్ని వారికి తెలియజేయటమే కాక, మీ జ్ఞానాన్ని కూడా ఇంకా అభివృద్ధి చేసుకోవచ్చునన్న విషయాన్ని తెలియజేస్తే ఇంకా మంచి జరుగుతుందని అన్నారు. మీరందరూ ఒక్కో వైద్యుడు మరో పదిమంది వైద్యులను మూడు నెలల్లో 'పల్లెసృజన'తో అనుసంధానం చెయ్యాలని, ఇలాంటి మూలికా వైద్యుల సమావేశం హైదరాబాద్ స్థాయిలో కాక, మీ మీ ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రత్యేక నిపుణులైన శాస్త్రి గారు, శర్మ గారు, శ్రీరామ్మూర్తి గారు, కవిత, సి.సి.యం.బి. సైంటిస్టులు ఇంకా సమావేశంలో పాల్గొన్న శ్రోతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా మాకు అమూల్యమైన సహాయాన్ని అందించిన శాస్త్రి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు




ఎ. గంగన్న

అన్నారు. మీరందరు ముమ్ముందు ఈ ఉద్యమంలో మరింత చురుగ్గా పాల్గొని మీ సహకారాన్ని అందజేస్తే ఆనందంగా వుంటుందని, సమావేశానికి వచ్చి వారు మాట్లాడకున్నా మేము చెపుతున్న విషయాలను వింటూ అవగాహన చేసుకున్న వారికి, ఈ సమావేశం ఏర్పాటు చేసి విజయవంతంగా జరిగేలా చేసిన 'పల్లెసృజన' వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పల్లెసృజన ఉపాధ్యక్షులు శ్రీ దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో జరిగిన మూలికల సేకరణ ఆ తర్వాత ఎన్.ఐ.ఎఫ్. ఎలా వీటిని ముందుకు తీసుకు వెళుతుందో తెలియజేస్తూ, ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో అడవులు అంతరించి పోతున్నాయని, అందువల్ల కొన్ని మూలికలు అంతరించిపోయే ప్రమాదముందని, అలా అంతరించి పోతున్న మూలికలు ఏవైనా మీ దృష్టికి వస్తే వాటిని మాకు తెలియజేస్తే, ఆ మూలికల విత్తనాలను సేకరించి మీకు అందజేస్తామని, వాటిని మీ సమీప అడవిలోగాని, పెరట్లో గాని పెంచినట్లయితే అవి అంతరించి పోకుండా వుండే అవకాశం వుందని అన్నారు.

తర్వాత బ్రిగేడియర్ గణేశం గారు డా. విపిన్ గారిని మాట్లాడ వలసిందిగా కోరగా వారు మాట్లాడుతూ 'మీ తెలుగు భాష నాకు అంతగా తెలియకపోయినా, మీ భావాలను చదవగలుగుతున్నానని, బ్రిగేడియర్ గణేశం గారు చాలా మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఆహ్వానించడం, మేము పాల్గొనడం మాకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. మేము మీ జ్ఞానాన్ని తీసుకుని వెళ్ళి ప్రపంచంలో ఇతర జ్ఞానాలతో పోల్చి, మీది విశిష్ఠంగా వుందని నిరూపణ అయితే దానిని పేటెంట్ చేసే ప్రయత్నాలు కూడా చేస్తామని, రెండవసారి మనం కలుసుకున్నపుడు మా

జ్ఞానాన్ని మీరేం చేశారని అని అడిగే హక్కు మీకుందని, ఈ సమావేశంలో మహిళలు లేకపోవటం లోటుగా ఉందని, వచ్చే సమావేశంలో ఆ లోటును భర్తీ చేసుకుందామని అన్నారు. ఈ జ్ఞాన మార్పిడి దేశవ్యాప్తంగా చేయటానికి మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

రెండురోజుల సమావేశంలో పాల్గొన్న వైద్యులంతా సమావేశ నిర్వహణ పట్ల, జరిగిన తీరుతెన్నుల పట్ల సమావేశంలో మార్పిడి జరిగిన జ్ఞానం గురించి తమ సంపూర్ణ సంతృప్తిని వెలిబుచ్చారు. మేము మారుమూల ప్రదేశాల్లో వున్న మా ఊళ్ళల్లో వైద్యం చేసుకుంటున్న మమ్మల్ని, రాష్ట్ర రాజధానియైన హైదరాబాద్‌కు పిలిపించి మాకింత గౌరవాన్ని కలుగజేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మామీద ఇంత బాధ్యత వుందని ఇప్పుడే తెలుసుకున్నాము. మామీద వుంచిన బాధ్యతని పరిపూర్ణంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో పొందిన జ్ఞానంతో ప్రజలకు ఉత్తమ వైద్యాన్ని చేయగలిగే అవకాశం లభించిందని మూలికా వైద్యులు ఆనందంతో వక్కాణించారు.

పట్టణాలలో వుంటున్న మీలాంటివారు (ఎన్.ఐ.ఎఫ్., హనీబీ, పల్లెసృజన) పల్లెల్లో వున్న సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తేవటమే కాక, మాలాంటి వ్యక్తులకి చేయూతనిస్తున్నందుకు చాలా ఆనందంగా వుందన్నారు. మూలికా వైద్యుల సమావేశం అత్యంత జ్ఞానపరంగా, సహృదయంతో అందరి సహకారంతో అనుకున్న ఉద్దేశ్యాలను సాధించి విజయవంత మైందన్న ఆనందం అందరిలో కనిపించింది. ●

## ఆంధ్రప్రదేశ్ మూలికావైద్యుల సదస్సుకు హాజరైన వైద్యుల వివరాలు

| వ. | పేరు | గ్రామము | జిల్లా | ఫోన్ నెం. |
|---|---|---|---|---|
| 1. | పి. ఉమా మహేశ్వర రావు | మణుగూరు | ఖమ్మం | 94402 86854 |
| 2. | బి. మోహన్ రెడ్డి | నాచనపల్లి | వరంగల్ | |
| 3. | బి. కుమార స్వామి | నాచనపల్లి | వరంగల్ | 86863 48900 |
| 4. | పి. ఐలయ్య | నార్కట్‌పల్లి | వరంగల్ | ... |
| 5. | ఇ. మల్లయ్య | ఉప్పరపల్లి | వరంగల్ | ... |
| 6. | పి. దశరథం | చిలకమ్మనగర్ | వరంగల్ | 86035 20521 |
| 7. | యస్. సమ్మయ్య | ధనుగండి | వరంగల్ | 96662 95542 |
| 8. | కె. సోమనాథ్ | మనపురం | శ్రీకాకుళం | 94919 13612 |
| 9. | ఎ. సన్యాసిరావ్ | పనసమాను గూడ | శ్రీకాకుళం | 96406 94274 |
| 10. | కె. గంగన్న | పనసమానుగూడ | శ్రీకాకుళం | ... |
| 11. | ఎ. ప్రకాష్ | దుగ్గి | శ్రీకాకుళం | |
| 12. | కె. గోపాల్ రావ్ | రాజలంక | శ్రీకాకుళం | |
| 13. | జి. రామన్న | తోటవలస | శ్రీకాకుళం | |
| 14. | యస్. భీమన్న | కొత్తవలస | విశాఖపట్నం | |
| 15. | యస్. నాగులు | సుక్రుగూడ | విశాఖపట్నం | |
| 16. | పి. లోలిత్ | కొర్రా | విశాఖపట్నం | |
| 17. | పి. సోమ్యా | బుడమలపుట్టు | విశాఖపట్నం | |
| 18. | పి. సోమయ్య | క్రిష్ణాపురం | విశాఖపట్నం | |
| 19. | యస్. నాగేశ్వర రావు | కొర్రా | విశాఖపట్నం | |
| 20. | యస్. ప్రసాద్ | కొర్రా | విశాఖపట్నం | |

### బూమ్ స్ప్రేయర్ తయారు చేసిన సయ్యద్ సుభాని మరో స్ప్రేయర్

# నాల్గు నాజిల్ల స్ప్రేయర్




'పల్లెసృజన' పాఠకులకు సయ్యద్ సుభాని సుపరిచితుడే. గతంలో 'బూమ్ స్ప్రేయర్'ను తయారు చేసి లిమ్కా రికార్డు కెక్కిన ఘనత సయ్యద్ సుభానిది. తన నిరంతర అన్వేషణలో భాగంగా సన్న, చిన్నకారు రైతుల కోసం ఎక్కువ నాజిల్లు గల చేతితో పనిచేసే స్ప్రేయర్‌ను (మల్టీ నాజిల్ స్ప్రేయర్) తయారు చేశాడు.

మామూలు చేతితో పనిచేసే స్ప్రేయర్ లాగా నే వుంటుది కానీ నాజిల్ మాత్రం ప్రత్యేకంగా వుంటుంది. మామూలు నాజిల్ పైపుకి ఒకే నాజిల్ కాకుండా, ఆ



ప్రాంతంలో అడ్డంగా ఓ పైపు వుంచి, దానికి నాలుగు నాజిల్స్ పెట్టడం ద్వారా ఒకే సమయంలో దాదాపు ఒక మీటరు వెడల్పులో స్ప్రే చేయగలదు. దీని బరువు 22 కిలోలు, ఒకే మనిషి రోజుకు 10 నుండి 12 ఎకరాల వేరుశనగ పొలానికి మందు స్ప్రే చేయవచ్చు. దీని విలువ దాదాపు రూ. 3000/- వరకు వుంటుంది. 12 లీటర్ల మందు నీటి ట్యాంకు సామర్థ్యం గల ఈ పంపు నాజిల్ సైజు 0.5 నుండి 1 మి.మీ. వరకు వుంటుంది.

వరి, వేరుశనగ, పత్తి, పొగాకు, మిరప, కంది, శనగ వంటి పైర్లపై క్రిమి సంహారకాల పిచికారి చేయటానికి చాలా అనువుగా వుంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ పంటపై స్ప్రే చేయవచ్చు. ఎలాంటి ఇంధనం, కరెంటు అవసరం లేదు, కేవలం మానవ శక్తితోనే పనిచేస్తుంది. ఎలాంటి నిర్వహణా ఖర్చు వుండదు, మామూలు స్ప్రేయర్లకన్నా నాలుగురెట్లు అదనంగా పనిచేస్తుంది. సన్న, చిన్నకారు రైతులు ఈ స్ప్రేయర్ ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ పొలంలో క్రిమి సంహారకాలను స్ప్రే చేయటం ద్వారా తమ సమయాన్ని ఆదా చేసుకోవచ్చు.

వివరాలకు : సయ్యద్ సుభాని, ఫోన్ : **98486 13687**

# కొత్త రీతిలో మునగ అంట్లు పోసే మల్లిక



మునగచెట్లు అంట్లు కట్టడం మామూలే అయినా సాంప్రదాయ పద్ధతిలో కాక, రెండింతల మొక్కలు వచ్చేవిధంగా కొత్త పద్ధతికి వరవడి సృష్టించడం మాత్రం గొప్పే కదా! అటువంటి పనిని సాధించి చూపించింది తమిళనాడుకు చెందిన దిండిగల్ జిల్లాలో పల్లపట్టి గ్రామవాసి, వ్యవసాయ కూలీ 34 సంవత్సరాల 'మల్లిక'. చిన్నప్పుడు పేదరికం కారణంగా ఎక్కువగా చదువుకోలేక పోయింది మల్లిక. తన భర్త గొర్రెలకాపరి. వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడన్నట్లు ఈమెకూడా ఒక నర్సరీలో పనిచేసేది. వీరికిద్దరు ఆడపిల్లలు. ఒకరు పాఠశాలలో, మరొకరు కళాశాలలో చదువుకుంటున్నారు.

మల్లిక గత 8 సంవత్సరాల నుంచి అదే గ్రామానికి చెందిన అలగర్ సామి గారు నడిపే నర్సరీలో కూలీగా పనిచేస్తోంది. ఆయనకి కొత్తరకం మునగ రూపొందించి నందుకు గాను 'సృష్టి సన్మాన్' పురస్కారం గతంలో లభించింది. ఈయన తన నర్సరీలో మునగ నాట్లు, మొలకలు రూపొందించి విక్రయిస్తూ వుంటారు. ఈమె అక్కడే వినూత్నంగా ఒకే కొమ్మకి రెండుచోట్ల అంటు కట్టడం చేసి ఫలితం సాధించింది. అదిచూసి అలగర్ సామి కూడా సంతోషంగా మెచ్చుకున్నారు. ఇప్పుడక్కడ చాలామంది ఇదే పద్ధతి పాటిస్తున్నారు.

భూమిలో కాక, గాలిలోనే ఆమె కొమ్మలకి కొంత గాటు పెట్టి (అర సెంటీమీటరు మేర ముక్క చెక్కి) అక్కడ ప్రత్యేక పద్ధతిలో ముందే తయారు చేసి వుంచుకున్న ద్రావకంలో సముద్రపు నాచుని నానబెట్టి ఆ గాటు చుట్టూ పెట్టి అందులోకి గాలి చొరబడకుండా ప్లాస్టిక్ కాగితం చుట్టి, బిగుతుగా దారంతో కట్టిపెట్టేది. సాధారణంగా అలంకార మొక్కలు, పూలు, కాయగూరల మొక్కలకి ఈవిధంగా చేస్తూవుంటారు. ఇలా చేయటం వలన ఒక చెట్టునుండి అదేరకమైన అనేక చెట్లను రూపొందించవచ్చు. సాధారణంగా పిల్లల వ్రాసుకునే పెన్సిల్ మందం వున్న కొమ్మలో ఒక్కచోటే చెక్కి నాటు వేస్తూ వుంటారు. ఈ విధంగా ఒకసారి చెట్టుకి దాదాపు 10, 12 చోట్ల చేసి నాటు కట్టవచ్చు. దాదాపు ఒక నెల రోజుల తర్వాత అక్కడ వేర్లు వస్తాయి. అప్పుడు వాటిని కత్తిరించి ఒక ప్లాస్టిక్ సంచిలో నాటి ఒకచోటకి చేర్చి వాటిని రెండు లేదా మూడు నెలల పాటు నీరు పోస్తూ మొక్క దృఢంగా తయారయ్యేలా చేయాలి. అప్పుడు మొక్క అమ్మకానికి / మారు నాటడానికి సిద్ధంగా వుంటుంది. మొక్కనుంచి అంటును వేరు చేసిన తర్వాత మళ్ళీ ఇదే పద్ధతిలో అదే చెట్టుకి అంటు కట్టుకుంటూ వుంటారు. కాకపోతే చలికాలం, వర్షాకాలం ఒక నెలకన్నా ఎక్కువ సమయం పడుతూ వుంటుంది. పొలంలో నాటిన ఆరు నెలల తర్వాత మొక్కలు చెట్లయి కాపు కాయటం ప్రారంభిస్తాయి. ఇలా దాదాపు 10 నుండి 15 సంవత్సరాల వరకు కాపు కాస్తూనే వుంటాయి. స్థానిక వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రూపొందించిన మునగ రకం కేవలం

ఒక్క సంవత్సరం మాత్రమే కాస్తుంది కనుక దానితో పోలిస్తే ఇది ఎల్లకాలం కాసే రకంగా చెప్పుకోవచ్చు.

దీని కారణంగా రైతులు విత్తనాలు వేసి, మొక్కలు పెంచటంకన్నా, ఈ విధంగా అంటు కట్టిన పద్ధతిలో రూపొందించిన చెట్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వుంటారు. మల్లిక నర్సరీలో పనిచేస్తున్న కాలంలో కొమ్మకి ఒకచోట గాటు పెట్టి అంటు కట్టడంకన్నా, రెండుచోట్ల ఎందుకు చేయకూడదు, చేస్తే ఏమవుతుంది అన్న ఆలోచన వచ్చింది. యజమానికి చెప్తే ఏమనుకుంటాడో అని సంశయించి, ఎవరికీ చెప్పకుండా తానే ప్రయత్నించింది. ఇది జరిగి దాదాపు రెండు సంవత్సరాలయింది. ఆమె ఒకే కొమ్మలో రెండుచోట్ల గాటు పెట్టి అంటు కట్టింది. మామూలుగా గాలి చొరబడకుండా కట్టు కట్టేసింది. ఆమెకి ఆశ్చర్యం కలిగించే విధంగా ఒక నెల తర్వాత అంటు కట్టిన రెండు చోట్లనుంచి వేళ్ళు వచ్చాయి. ఆమె వాటిని తీసి రెండు పాలిథిన్ సంచులలో నాటింది. ఆమెకి ఒక మొక్క స్థానంలో రెండు మొక్కలు వచ్చాయి. ఇది యజమాని తెలుసుకొని ఆమెని అభినందించాడు. ఇప్పుడు ఆ ప్రాంతంలో అందరు నర్సరీ యజమానులు ఇదే పద్ధతిని అవలంభించటం ఆనవాయితీ అయిపోయింది.

సాధారణంగా సంవత్సరానికి ఒక చెట్టుకి దాదాపు 40 వరకు అంట్లు పోసి మొక్కలు తీయవచ్చు. కానీ ఈ పద్ధతిలో, 60 నుండి 70 మొక్కల అంట్లు కట్టి అదేరకమైన కొత్త మొక్కలని తయారు చేయవచ్చు. ఈ పద్ధతిలో నర్సరీల ఆదాయం చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. మొక్కల నాణ్యత విషయంలో ఏవిధమైన మార్పు ఉండదు. ఈ విధమైన అంటు కట్టే పద్ధతిలో ఒక కొమ్మకి రెండుచోట్ల గాట్లు పెట్టి



చెక్కిన చోట నాచు వుంచి, దానిచుట్టూ గట్టిగా గాలి సోకకుండా పాలిథిన్ పేపర్ చుట్టి రెండు వైపులా గాలి చొరబడకుండా దారంతో కట్టివేస్తారు. ఈ నాచు (సముద్రపు మాస్)ని ప్రత్యేకంగా సాంప్రదాయ పద్ధతిలో రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకున్న ద్రావకంలో ముంచుతారు. ఈ ద్రావకాన్ని వారు పంచగవ్య, గుణపించల, కుళ్ళిన బొప్పాయిని కలిపి తయారు చేసుకుంటారు. ఈ పద్ధతిని అక్కడి నర్సరీ వారు చాలా కాలం నుంచి అవలంబిస్తున్నారు.

**ఒకేచోట రెండు మొక్కలు నాటడం:**

సాధారణంగా మునగ చెట్లు దాదాపు 20 అడుగుల దూరంలో నాటుతూ వుంటారు. ఒక గుంటకు ఒక మొక్క చొప్పున నాటడం సాధారణ పద్ధతి. కానీ చెట్లు పెద్దవయ్యాక గాలికి ఒరిగిపోవటం, విరిగి పోవటం గమనించింది మల్లిక. ఒకసారి పొరపాటున ఒక గుంటలో రెండు మొక్కలు నాటగా అవి పెరిగి పెద్దవై ఒకదానితో ఒకటి పెనవేసుకొని పోవటం వలన గాలికి ఒరిగిపోకుండా నిలబడటం గమనించింది మల్లిక. దీనివలన గాలికి పూత రాలిపోకుండా ఎక్కువ కాయలు రావటం కూడా గమనించిందామె. పూలు దగ్గర దగ్గరగా వుండటం వలన పరపరాగ సంపర్కం తేలికగా జరిగి కాయలు ఎక్కువగా వస్తున్నాయని గ్రహించిందామె. ఇది తెలుసుకున్న మల్లిక తన యజమానిని ఈ పద్ధతి పాటించమని కోరింది. ఆయన తొలుత కాదన్నా తర్వాత ఒప్పుకొని గత నాలుగు సంవత్సరాల నుంచి ఇదే పద్ధతిని పాటిస్తున్నారు ఆ నర్సరీలో. దీనితో అంటు కట్టిన మొక్కల సంఖ్య రెండింతలవటమే కాక, గాలివలన నష్టం లేకుండా కాయలు కూడా రెండింతల దిగుబడినిస్తున్నాయి. ఇది గమనించి ఇతర రైతులు ఇదే పద్ధతిని పాటిస్తున్నారక్కడ. ఇప్పుడా ప్రాంతంలో దాదాపు 300 మంది మునగ రైతులు ఇదే పద్ధతిని వాడి చాలా బావుంది అంటున్నారట. వీరిదగ్గర నుంచి మొక్కలు కొన్నవారు తమ దిగుబడి 20 టన్నుల నుంచి 30 టన్నులకి పెరుగుతోందని చెబుతున్నారు.

ఇంకా వివరాలు కావలసిన వారు సంప్రదించ వలసిన చిరునామా : శ్రీమతి పి. మల్లిక, (భర్త శ్రీ పండరం), పశ్చిమ వీధి, పల్లపట్టి గ్రామం, నీలకొట్టయ్ తాలూకా, దిండిగల్ జిల్లా, తమిళనాడు రాష్ట్రం. సెల్ : (పి.పి.) 098653 45911.

**(తమిళనాడు, మధురై లోని 'సేవా' సంస్థ సౌజన్యంతో)**

# ఆ కాలంలో కాళ్ళకి చెప్పులు లేవు ...... - దిత్లీబెన్

గుజరాత్‌లోని 'ఛోటాఉదయ్‌పూర్' పట్టణానికి 25 కి.మీ. దూరంలో వుంటుంది 'లేవ్ హాత్' గ్రామం. ఈమధ్యనే ఆ ఊరికి కొత్తగా రోడ్డేశారు కూడా. అక్కడే 'దిత్లీబేన్' తన కొడుకు కోడలితో వుంటోంది. మా అత్తగారి పూర్తిపేరు 'దిత్లీబేన్ తేర్‌సింగ్ రాత్వా' అని చెప్పింది ఆమె కోడలు. ఆమెకి ఖచ్చితంగా 100కన్నా ఎక్కువ సంవత్సరాల వయస్సే వుంటుంది అని చెప్పిందామె. ఎందుకంటే గత సంవత్సరం చనిపోయిన మా నాన్నగారి వయస్సే దాదాపు 100 సంవత్సరాలు వుంటుందపుటికి, వీరిద్దరు ఒకే వయస్సు వారే దీనిని బట్టి ఈమె వయస్సు వంద సంవత్సరాల పైమాటే అందావిడ.

మేం వచ్చామని తెలిసి ఆమె తన చిన్న గుడిసెలోంచి బయటకి వచ్చింది. చాలా బలహీనంగా వుంది. అయినా ఒక చేతికర్ర సాయంతో నడుస్తూ తన పనులు తనే చేసుకోగలుగుతుంది. ఆమె వచ్చి కూర్చుని చిరునవ్వు నవ్వింది. వెన్నెల విరిసినట్లుందా నవ్వు. మేము ఆమెనెందుకు కలవటానికి వచ్చామో ఆమెకుఅర్థం కాలేదు.



చూసి వెళ్ళటానికి వచ్చామని చెబితే సర్దుకొని మాటలు ప్రారంభించి తనగురించి చెప్పసాగింది.

ఆమె చిన్నతనమంతా కష్టాలతోనే గడిచిందట. చాలా చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. ఆ తర్వత కొద్ది కాలానికే తండ్రికూడా పోయాడు అన్నదామె. తిండి సంపాదించుకోవాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. పక్కనున్న ఇళ్ళవాళ్ళని అడిగేది వాళ్ళు తినగా మిగిలిందేమైనా వుంటే పెట్టమని. ఉంటే పెట్టేవాళ్ళు, లేకపోతే లేదు. చుట్టుపక్కల వున్నవాళ్ళంతా పేదవారే. నేను చిన్నప్పుడు గులక రాళ్ళతో ఆడుకునేదాన్ని. మరి బొమ్మలు కొనుక్కోవడానికి డబ్బులుండేవి కావు అని చెప్పేదావిడ.

జరుగుతున్న ప్రస్తుత కాలంలో మీరేమైనా మార్పులు చూశారా అంటే, నా చిన్నతనంలోనే చూడవలసిన కష్టాలన్నీ చూసేసాను. గడ్డుకాలమంతా అప్పుడే అయిపోయింది ఆతర్వాత కొద్దిగా పరిస్థితులు చక్కబడ్డాయి. మారుమూలనుండే మా గ్రామంలో ఏమీ దొరికేవి కావు. నాకు చాలా తక్కువ బట్టలుండేవి. అసలు నేనెప్పుడూ చెప్పులు వేసుకోలేదు. ఊళ్ళోకెవరైనా బూట్లు వేసుకొని వచ్చారా అంటే వాళ్ళు బ్రిటీషు అధికారులైనా అయివుండాలి, లేదా హవల్దార్ (పోలీస్)లైనా అయుండాలి. నా భోజనం కూడా చాలా సాదా సీదాగా వుండేది. రకరాలుగా చేసుకుని తిని యెరగం అన్నదామె. అరికెలు లేదా కర్బూర గడ్డి కలిపి చేసిన రొట్టెలు తినేవాళ్ళం. బియ్యం అంటే ఏమిటో తెలియదు. అసలు 'టీ' అంటూ ఒకటి వుంటుందని తెలియదు మాకారోజుల్లో అని చెప్పిందావిడ. ఆమె బ్రిటీష్ అధికారులు ఊళ్ళోకొచ్చిన సందర్భాలని గుర్తు తెచ్చుకొని మరీ చెప్పింది. మత మార్పిడికై మిషనరీలు కూడా అప్పుడప్పుడూ వచ్చేవారు. చాలామంచి వాళ్ళు అని చెప్పిందావిడ. ఒకోసారి స్థానికంగా వుండే రాజుగారి మనుషులు వచ్చి కొన్ని రోజులకని నిర్బంధ కూలీకి తీసువెళ్ళేవాడట.

'దితిల్ బేన్' బాల్యం కష్టాలతో కూడుకున్నదే

అయినా ఆమె చురుగ్గా తనపని చేసుకునేదట. మాకు రోజంతా పిండి విసరటం లేదా బైటకెళ్ళి నీళ్ళు తీసుకు రావటంతోనే సరిపోయేది. నేనసలు నీళ్ళు తేవటం నా అయిదవ ఏటనుంచే ప్రారంభించాను తెలుసా అన్నదామె. ఏదీ దగ్గరలో లేని కారణంగా రోజుకి దాదాపు 20 కి.మీ. నడవాల్సి వచ్చేది. మాకు ఏ విధమైన రవాణా సౌకర్యాలు వుండేవి కావని అన్నదావిడ.

మా కాలంలో రైతులు రసాయనిక ఎరువులు వాడేవారే కాదు. ఆ కాలంలో మేము ఏ జబ్బు వచ్చినా నిమ్మకాయ రసం వాడేవాళ్ళం. కాళ్ళు చేతులు విరిగితే ఒక బట్టలో మెంతుల పొడి వేసి, విరిగిన చోట వుంచి బిగించి కట్టు కట్టేవాళ్ళం. 'పెద్ద కశిండా' వండిపెట్టేవాళ్ళం అది మంచి బలాన్నిస్తుంది అన్నదావిడ. మాతోపాటు వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయుడు 'శాంతిలాల్ పాండ్యా' కూడా ఆ చెట్టులో అయోడిన్, ప్రొటీన్స్ వుంటాయని చెప్పారు.

అవును బావులలో నీటిమట్టం తగ్గిపోతోంది, వర్షాలు పడటం కూడా తగ్గిపోతున్నాయి అన్నదావిడ. అసలు వర్షాలు చాలా ఆలస్యంగా వస్తున్నాయి. ఒకవేళ వచ్చినా కుంభవృష్టి లేనేలేదు. నా చిన్నతనంలో వాతావరణం చక్కగా, ఆహ్లాదకరంగా వుండేది. ఇప్పుడు చలికాలం మరీ చలేస్తోంది అన్నదామె చేతులు ముడుచుకుంటూ.

ఆకాలంలో పెళ్ళిల్లు ఎంతో సీదాసాదాగా, ఆర్భాటం లేకుండా వుండేవి. పెళ్ళితంతు పూర్తయిందని చెప్పటానికి పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఒకరికొకరు బెల్లం ముక్క తినిపించేవారు. అంతే పెళ్ళయిపోయినట్టే. తరువాత ఆడవాళ్ళంతా బళ్ళు ఎక్కేవాళ్ళు, మగవారంతా డప్పు తాళానికి అనుగుణంగా నాట్యం చేస్తూ కదిలేవాళ్ళు. ఇళ్ళు చేరేంతవరకు ఇదే తంతు. మేము పెళ్ళికైనా, చావుకైనా డప్పు మాత్రం తప్పనిసరిగా వాయించేవాళ్ళం అని చెప్పారావిడ.

'దితిల్‌బేన్' జీవితం చాలా సీదాసాదాగా గడిచిపోయింది. ఆమె తినే తిండిలో కొంత ఉప్పు ఉండేది. ఎప్పుడూ కొంచెం మసాలా వుండేది. ఆమె జీవితం కూడా అంతేగా!

## రైతులు తయారు చేసిన అధిక దిగుబడులనిచ్చే విత్తనాలు

ఎన్.ఐ.ఎఫ్. దేశవ్యాప్తంగా రైతులు 'ఎక్కువ దిగుబడినిచ్చే, క్రిమి కీటకాలు ఆశించే అవకాశం తక్కువ వున్న విత్తనాలను తయారు చేస్తున్నారు. వీటిని 'పల్లెసృజన' ఆంధ్రప్రదేశ్‌లో సరఫరా చేయటానికి సిద్ధంగా వుంది. వీటి వివరాలను 'సెప్టెంబర్–అక్టోబర్ 2012' సంచికలో ప్రచురించాం. ఈ క్రింది విత్తనాలు 'పల్లెసృజన' కార్యాలయంలో లభిస్తాయి.

❀ **కందులు (రిచా-2000 రకం)**

❀ **వరి (జి.ఆర్.కె.)** ❀ **మిరప**

❀ **గోగరకాయ (చెవులకాయ, గోరుచిక్కుడు)**

❀ **గోధుమ** ❀ **వేరుశనగ**

పై విత్తనాలు కావలసిన వారు

**'పల్లెసృజన' కార్యాలయం,**


**సికింద్రాబాద్,**

**ఫోన్ : 040–2711959** లో సంప్రదించి పొందగలరు.

గమనిక : మీరు సంప్రదించిన పదిహేను రోజులలో విత్తనాలు మీకందించగలం.

# వెలుగులోకి రాని మహిళల సృజనాత్మకత

- ఆచార్య అనిల్ కె. గుప్త



మనం వైఫల్యం చెందినప్పటికీ, కొంచెం ఆలోచించి మన అంతరాత్మ చెప్పిన మాటలు వింటే మన వైఫల్యంలోనూ ఏదో కొత్తదనం వుందని తెలుస్తోంది. నాకు బాగా గుర్తు..... రాజస్థాన్‌లోని అల్వార్ ప్రాంతంలో మేము శోధయాత్ర జరుపుతున్నపుడు రాత్రిపూట జరిగే సమావేశాలకు మహిళలు వచ్చేవారు కాదు. ఆ సమావేశాలలో మేము ఇతర ప్రాంతాల్లోంచి సేకరించిన ఇన్నోవేషన్ల చిత్రాలు ప్రదర్శించినా వారు వచ్చేవారు కాదు. అక్కడికి చేరిన పురుషులని మేము మీ ఆడవారిని కూడా తీసుకురమ్మని మర్యాదపూర్వకంగా కోరేవాళ్ళం. ఏవో సాకులు చెప్పేవారే కానీ, ఫలితం కన్పించేది కాదు. కొంతసేపయ్యాక మేము ప్రదర్శనని మధ్యలో నిలిపివేశాం. అప్పటివరకు మంచి మంచి చిత్రాలు, ఆసక్తికరమైన విషయాలు చూస్తున్నవారు అది ఆపేయటం భరించలేక ప్రదర్శన కొనసాగించమని కోరారు. మా వాలకం చూసి మీరు ప్రదర్శన కొనసాగించండి మహిళలు వాళ్ళే వస్తారు అని చెప్పారు. మేము కూడా వాళ్ళనీ రానీయండి, వచ్చాక ప్రారంభిద్దాం అన్నాము. ఆ తర్వాత ఆశ్చర్యకరంగా చాలామంది మహిళలు ప్రదర్శన చూడ్డానికి వచ్చారు. అలా చేయటం మాకూ ఇబ్బంది అన్పించినా మాకు కావలసిన ఫలితం మాత్రం వచ్చింది. ఈ విధంగా అందరూ (స్త్రీ పురుషులు) సమానమేనని తెలియజేయటానికి మేము అవలంభించిన ఈ వినూత్న సత్యాగ్రహం ఆచరణలో పెట్టడానికి ఇంత సమయం ఎందుకు పట్టింది. ఇది ఎప్పుడో చాయాల్సుండేది కదా అనుకున్నామాతర్వాత.

ఇంతవరకు జరిగిన బహుమతి ప్రదానోత్సవాలలో చాలా తక్కువ మంది మహిళలకి బహుమతులు వచ్చాయి. పిల్లలకి జరిపే వార్షిక ఇగ్నయిట్ పోటీల ఫలితాలు మాత్రం కొంత ఆశాజనకంగా వున్నాయి. అది చూసి అనిపిస్తూ వుంటుంది భవిష్యత్తు ఆశాజనకంగా వుంటుందని. అయినా సమాజంలోని అన్ని వర్గాలకూ చెందిన మహిళల సృజనాత్మకతను ఎంతకాలం విస్మరించగలం?

ఉత్తమ ఇన్నోవేటర్లు, సృజనాత్మకత, సాంప్రదాయ జ్ఞానం కలవారి జాబితాలో ఎక్కువ సంఖ్యలో మహిళలను కూడా చేర్చాల్సిన ప్రయత్నాలు ముమ్మరం చెయ్యాలి. ఇక వేచివుండటం ఏమాత్రం కూడదని నాకనిపిస్తోంది. మేమీ వ్యత్యాసాన్ని 13 సంవత్సరాల క్రితం 2000 సంవత్సరం లోనే పసిగట్టాం.

మహిళలు కొత్త ఇన్నోవేషన్లు చేయలేక పోవడానికి కారణం హనీబీ వారు ఎప్పుడో గమనించారు. మన సమాజంలోని ఆడవారు సాంకేతికపరమైన అవరోధాలను దాటడంలో స్వతంత్రంగా ఆలోచించనీయక వారిని ఇతరులు చెప్పే విధానాలు పాటించమని బలవంతంగా ఒప్పిస్తున్నాం. మహిళలు సృజనాత్మకతలో పురుషులకేమాత్రం తీసిపోరు. కొత్తని కనుగొనటానికి ఉపయోగపడే పనిముట్లని వారికి అందుబాటులో లేకుండా చేస్తున్నారు. మనమే కాదు, మన సంస్థలూ దీనిని గురించి పట్టించుకోవటం లేదు. కానీ

సంతోషం ఏమిటంటే పల్లెస్థాయిలో వున్న ఇన్నోవేటర్లు మాత్రం మహిళలకి ఉపయోగ కరంగా వుండి, వారిని శారీరక, ఆర్థిక బాధల నుండి విముక్తి కలిగించే ఇన్నోవేషన్లు చేస్తున్నారు, ఇంకా ప్రయత్నిస్తునే వున్నారు.

ఈ విషయంలో మన ఊహలు, తంత్రాలు సమయానుకూలంగా లేవు. మహిళల సంక్షేమానికి ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న మనం వారి జ్ఞానాన్ని, సృజనాత్మకతని వెలుపలికి తీయటంలో వెనుకబడే వున్నాం. ఒకవిధంగా చెప్పాలంటే దీన్నసలు మనం పట్టించుకోవటమే లేదు. ఈ విషయంలో మహిళా గుంపులు, సంస్థలు కూడా ఏమీ చేయటం లేదని మనం ఆత్మవంచన చేసుకోకూడదు. మన హనీబీ వేరే అని నిరూపించుకోవాలి. భవిష్యత్తులో ఈ సమస్యని అధిగమించటానికి మేము తీసుకొనబోయే చర్యల గురించి చెబుతాను.

1. వేసవి కాలంలో జరిగే శోధయాత్రలో కేవలం పొలాలలో పనిచేసేవారు, మహిళల సృజనాత్మకత, జ్ఞానం పైననే దృష్టి పెట్టదలచుకున్నాం. ఈ రెండు వర్గాల నుంచి మనం బహుమతులు ఇచ్చే శాతం చాలా తక్కువగా వుంది. వారిపైనే దృష్టి కేంద్రీకరిస్తాము అంటే మిగతా వర్గాలని విస్మరిస్తామని కాదు, వీరికి ప్రాముఖ్యత ఇస్తాము అని.

2. ఆడపిల్లల నుంచి కొత్త ఆలోచనలను సేకరించే పోటీలని ఏవిధంగా సేకరిస్తున్నామో అదేవిధంగా మహిళలకు కూడా వారిలో అదృశ్యంగా వున్న మేధస్సుని వెలుగులోకి తీసుకు రావటానికి పోటీలను నిర్వహిస్తాం. ఆలోచనలు, కోరికలు ఉన్నాయి కాని, వాటిని ఎలా సాధించాలి అన్నది ప్రశ్న కాకూడదు. ముందు ఆలోచనలు అన్నవి వస్తే వాటిని ఏవిధంగా ఆచరణలో పెట్టాలి అన్నది అదే వస్తుంది.

3. మహిళా వర్గం నుండే విలక్షణమైన సాంప్రదాయ జ్ఞానానికి మరింత విలువను జోడించి, సమాజానికి అందజేయడమనే అంశానికి పెద్దపీట వేయాలి. ఈ ఆలోచనలు, వాటిలో అంతర్గతంగా వున్న విలువలనే మంచి ఉదాహరణల ద్వారా చెప్పే ప్రయత్నం చేయాలి. ఒక్కసారి కొందరు మహిళలు తమ ఆలోచనలని మనతో పంచుకోవటం అంటూ ప్రారంభిస్తే అది చూసి అటువంటి ఆలోచనలు లేదా ఇతర ఆలోచనలు వున్న మహిళలు కూడా అవి మనతో పంచుకోవటనికి ముందుకు వచ్చే అవకాశముంది. ఇక్కడొక ఉదాహరణ చెబుతాను. రాజస్థాన్‌కు చెందిన సంతోష్ పచార్ సృష్టించిన కొత్త గాజర్ (క్యారెట్) రకం , తమిళనాడుకు చెందిన అరియమ్మాళ్ మరియు పుష్ప సృష్టించిన కొత్త వరి రకం, మణిపూర్ లోని నంబూల్ జాతికి చెందిన 'ఓనిసమ్ యుమ్నమ్', ఇతరులు కలిసి కోళ్ళకు వచ్చే జబ్బుల నివారణకై కనుగొన్న వనమూలికా ఔషధము మొదలైన వాటిని ఈ 7వ ద్వైవార్షిక గ్రాస్‌రూట్ స్థాయి ఇన్నోవేషన్ల పురస్కాలకై గుర్తించడం జరిగింది. ఇది చూసి ఇతర మహిళలకు ఇది ప్రోత్సాహకారిగా వుంటుందని భావించవచ్చు. ఈసారి 7మంది బాలికా విద్యార్థుల ఆలోచనలను కూడా బహుమతికి ఎంపిక చేయటం జరిగింది. వారి ఆలోచనలు సాంకేతిక అంశాలు ఫలవంతమై రూపుదాల్చేకొద్దీ ఇతర మహిళా గళాలు కూడా ఎక్కువగా వినిపిస్తాయని ఆశిద్దాం.

4. మహిళలు ఎదుర్కొనే సాంకేతికపరమైన ఇబ్బందులను కూడా గుర్తించవలసిన అవసరం వుంది. తమకున్న ఇబ్బందులని అధిగమించే ఆలోచనలు చేస్తున్న మహిళలకు తగిన సహాయమందించే ఏర్పాటు చేయాలి. గత సంవత్సరం సమర్థవంతంగా పనిచేసే కట్టెల పొయ్యి, తేయాకు తెంపే ఉపకరం, వరి నారు నాటడానికి ఉపయోగపడే యంత్రం తయారు చేయమని ప్రజలకొక సవాలు విసిరాము. అవన్నీ మహిళల కష్టాలను తగ్గించే ఉపకరనాలే అయినా చాలా తక్కువ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. ఆడవారి సమస్యలకి మగవారు పరిష్కారం కనుగొనకూడదు అని ఎవరూ అనరు. కానీ మహిళలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం కనుగొనే సాధనాలు వారివద్ద లేకపోవడం మాత్రం విచారకరం.

కేవలం పిల్లలను పెంచటము, వంటలు చేయటమే కాక, మానవుల మనుగడకి సంబంధించిన అన్ని సవాళ్ళు పరిష్కరించటంలో మహిళల ఆలోచనలు, జ్ఞానము మాకు తెలియజేయమని కోరుకుంటున్నాము. మనమంతా పురస్కారాల సమయంలో మహిళల భాగం మగవాళ్ళ భాగంకన్నా ఎక్కువగా కాకపోయినా కనీసం వారితో సమంగా ఉండేలా చేయటానికి కృషి చేద్దాం.

(హనీబీ సౌజన్యంతో....)



# విస్మయం కలిగించిన మణిపూర్ శోధయాత్ర

**మణిపూర్ లోని చూరాచంద్‌పూర్ జిల్లా, తుయిలమ్‌జంగ్ నుండి చూర్‌చంద్‌పూర్ వరకు జరిగిన 2013 జనవరి 12 నుంచి 17 వరకు జరిగిన 30వ శోధయాత్ర విశేషాలు**

**మణిపూర్ లోని చూర్‌చంద్ పూర్ జిల్లాలో జరిగిన 30వ శోధయాత్రలో మాకు తారసపడ్డంతమంది సృజనాత్మకత కలిగిన పిల్లలు వేరెక్కడా తారస పడలేదు. ఆర్థికంగా చాలా వెనుకబడ్డ ఈ ప్రాంతంలో పాఠశాలలు కూడా లేని గ్రామాలలో కూడా కళ్ళల్లో గొప్ప కళలు దాచుకొన్న ఈ చిన్నారులను చూస్తుంటే ఆశ్చర్యం వేసింది. ఎప్పుడూ ప్రాంతీయ అల్లర్లకు నెలవైన ఈ ప్రాంతంలో ప్రజలు జ్ఞానార్తి కలిగి వుండడం ఒకవైపు, ఏమీ పట్టించుకోని ప్రభుత్వం ఒకవైపు, చాలా విచిత్రం అనిపించింది. గత 40 సంవత్సరాలుగా ఎవ్వరూ దర్శించని గ్రామాలతో సహా మేము ఏ గ్రామానికి వెళ్ళినా వారెంతో ఆప్యాయంగా ఆదరించారు. ఎందరో ఇన్నోవేటర్లు తమ ఆలోచనలను మాతో పంచుకోవటానికి ఎంతో ఉత్సాహం చూపారు. కానీ, పర్యావరణాన్ని రక్షించటానికి సంబంధించిన పరిశ్రమయొక్క ప్రాముఖ్యతను మార్కెట్ వర్గాలు గుర్తించలేక పోయాయి. ఇంతకుముందు ఒకరంటే ఒకరికి పడని తెగలకు చెందిన పిల్లలు ఒక అనాథాశ్రమంలో కలిసి మెలిసి జీవించటం చూస్తుంటే ఈ సమాజాన్ని తిరిగి నిర్మించే ప్రక్రియలో యువతను ఉత్సాహంగా పాల్గొనేలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయేమో అనిపించింది మా యాత్రీకులకి. ఈ ప్రాంతంలో ఎప్పటికైనా శాంతి స్థాపన జరుగుతుందా? చూద్దాం.....!**

ఒలంపిక్స్ పతక విజేత 'మేరీకోం' జన్మస్థలమైన మణిపూర్‌లో మాకు ఒక్కరు కాదు ఎందరో మేరీకోంలు దొరికారు. అక్కడికి వెళ్ళాక తెలిసింది మనకందరికీ ప్రేమ పాత్రమైన క్రీడాకారిణిని ఆ ప్రాంతం ఎలా ఇవ్వగలిగిందని. ఆ ప్రాంతంలో ఆడ మగలలో ఎక్కువ తక్కువలు లేకుండా ఆడవారు తమకు తోచిన దుస్తులు ధరించి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకోగలిగి, రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన గలిగే అవకాశముందక్కడ.

వసతులు సరిగా లేకపోవటం, ఆర్థిక ఇబ్బందులు, రక్త చరిత్ర కారణంగా ఆ ప్రాంతం కొంత చైతన్యాన్ని కోల్పోయిందని చెప్పాలి. ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రజాసంస్థలు మాత్రం చాలా చురుగ్గా పనిచేస్తున్నాయి. జాతి విద్వేషాల వల్ల చనిపోయిన గుంపుల మధ్య సయోధ్య, ప్రేమ, పరస్పర గౌరవం కల్పించటానికి విద్య, అభివృద్ధి సాధించటానికి గత దశాబ్ద కాలంలో ఈ సంస్థలు ఎన్నో చర్యలు ప్రారంభించాయి. అక్కడున్న గడ్డు పరిస్థితులలో నిజంగా అక్కడి ప్రజలు మాకెంతో ఆప్యాయంగా ఆశ్రయమిచ్చారు. అక్కడ ప్రకృతి శోభ అత్యద్భుతంగా వుంది. ఈ వ్యతిరేకతల మధ్య మేము మా యాత్ర ప్రారంభించాం. అంతర్గతంగా, బహిర్గతంగా....

మా యాత్ర వాటంతట అవే పెరిగిన అరటి చెట్లు, వెదురు, కాటన్ సిల్క్ చెట్లు, మామిడి (మీరు సరిగానే చదివారు ఇంత ఎత్తయిన ప్రదేశంలో మామిడి ఉండటం మాకూ ఆశ్చర్యాన్ని కలుగజేసింది) చెట్లున్న జూమ్ అని పిలువబడే చిన్న పొలాల మధ్యనుంచి సాగింది. మేము మా యాత్ర ఎంతో అంతర్గతంగా వుండి, అమాయకమైన నవ్వులు కలిగిన సంఘ మోయిన్ ఇన్ (అనాథాశ్రమం) నుండి ప్రారంభించాం. ఇక్కడ నిరంతరం జరిగే గొడవలలో చనిపోయిన వారి పిల్లలకు ఆశ్రయం కల్పించబడింది. ఈ అనాథ గృహాన్ని 'కూకీ మహిళా యూనియన్' (తల్లి లేని వారికి తల్లి) అన్న నినాదంతో నిర్వహిస్తున్నది. (దీని డైరెక్టర్‌ని smi_bijang@yahoo.com or lhingnu@yahoo.com వెబ్‌సైట్ ద్వారా కలువ వచ్చు). ఈ అనాథ శరణాలయం నుంచి కొందరు పిల్లలు మా శోధయాత్ర పూర్తయ్యేంత వరకు మాతోనే వుండి, వాళ్ళ ఆలోచనలతో పాటు ఇతర





25 కిలోల రైస్ కుక్కర్

కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఈ పిల్లలను చూస్తే వారిలో ఎంతో పట్టుదల, వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడగలమన్న ధైర్యం ఉన్నాయనిపించింది.

మేము మా యత్రలో 'మోల్ నామ్' గ్రామానికి చెందిన ప్రసిద్ధ వడ్రంగి 'హెచ్. పోకోయిలిన్ లూంగ్‌డిమ్' ని కలిశాం. ఆయన విడివిడిగా రెండు 25 కిలోల సామర్థ్యం గల కుక్కర్లలో వున్న బియ్యాన్ని ఒక డ్రమ్ములోనుంచి వచ్చే ఆవిరి ద్వారా ఒకేసారి ఉడికించగలిగే రైస్ కుక్కర్‌ని తయారు చేశాడు. మొదటి తడవ ఉడికించటానికి ఒక గంట సమయం పట్టినా తరువాత ఉడికించటానికి నీళ్ళు అప్పటికే వేడిగా వుంటాయి కనుక కేవలం 45 నిమిషాలు మాత్రమే పడుతుందట. ఈ పరికరాన్ని వారు పండగలలో, ఉత్సవాలలో సామూహికంగా అన్నం వండటానికి ఉపయోగిస్తుంటారట.

తర్వాత 'కాప్రాంగ్' గ్రామంలో 73 సంవత్సరాల 'పూ టంగ్‌టోకంగ్ కిబ్జన్'ని కలిశాం. ఈయన క్షయ, క్యాన్సరు, గుండెజబ్బులు, మధుమేహము మొదలైన అనేక దీర్ఘ రోగాలకి వనమూలికలతో చికిత్స చేస్తారట.

మా ప్రయాణం సాగినకొద్దీ ఈ ప్రాంతం ఎంత నిర్లక్ష్యానికి గురైందో గమనించకుండా ఉండలేకపోయాం. మేము ప్రయాణం చేసిన 70 కి.మీ. మార్గంలో మాకెక్కడా ఒక్క ఆసుపత్రి కూడా కనిపించలేదు. చాలాచోట్ల కరెంటు, విద్యా వసతులు, ఆరోగ్య సదుపాయాలు లేవు. అయినా సమాజంలోని పెద్దల పుణ్యమా అని పిల్లలు చదువుకుంటున్నారు. లేకపోతే ఇంత చురుకుదనం, సృజనాత్మకత వాళ్ళకెలా అబ్బుతుంది.

'కౌతు' అనే ప్రదేశానికి వెళ్ళగా అక్కడ తెలిసింది రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ వారు అలీన దళాలపై చేసిన యుద్ధంలో ఈ ప్రాంతం ముట్టడించబడింది అని. ఆ తర్వాత ఆ ప్రాంతానికి వచ్చిన బైటవారము మేమేనట! అప్పుడు బ్రిటీషు వారికి, జపాన్ దేశస్థులకి మధ్య జరిగిన యుద్ధంలో బాధపడింది సామాన్య ప్రజలు. ఇప్పుడు మణిపూర్ రాష్ట్రం లోపల, బైటవారితో జరుగుతున్న ఈ సమరంలో బాధపడేదీ స్థానికులైన అమాయక ప్రజలే. విచిత్రంగా లేదూ! ఇక్కడొక వయసుమళ్ళిన మహిళను కలవగా ఆమె ఏమో బాబూ యుద్ధం తర్వాత జబ్బులెక్కువైపోయినాయి అని బాధపడింది.

ఒక్కోసారి సాంఘిక ఉద్రిక్త పరిస్థితుల వలన









రోజుల తరబడి రోడ్ల దిగ్బంధం జరిగేది. దాని కారణంగా ఇక్కడి గ్రామాలన్నీ స్వయం శక్తిపై ఆధారపడటం నేర్చుకున్నాయి. ఈ విభక్తత కారణంగా స్థానిక మార్కెట్లు ద్రవ్యోల్బలానికి లోనవుతాయి. దీనిని అధిగమించటానికి ఎవరి ఆహారాన్ని వారే పండించుకోవటం అలవాటైంది ప్రజలకి. దాదాపు ప్రతి ఇంట్లో పెరటి తోటలుంటాయి. ఇక్కడ ఎక్కువగా ధాన్యం, ఆలుగడ్డలు, పసుపు, అనాస పండ్లు, కర్రపెండలం, మిరప, టమోటాలు, చెఱకు, వక్కలు, పుత్రజనిక పంటలు వేస్తూవుంటారు. ఇక్కడి ప్రజలు వెదురు, చుట్టుపక్కల అడవులలోని ప్రకృతిసిద్ధమైన వస్తువులనే ఎక్కువగా వాడుతారు. మేము అగరువత్తులు తయారు చేసే యంత్రం చూపించినపుడు అది వారికి కావాలని చాలామంది అడిగారు. ధర్మవీర్ అనే ఇన్నోవేటర్ రూపొందించిన అనేక పనులకి పనికి వచ్చే ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రం చూపినపుడు కూడా అది వారిని చాలా ఆకర్షించింది. దానికి కారణం ఆ ప్రాంతంలో ఎక్కువగా ప్రజలు అనేక పండ్లతో పాటు, నిమ్మగడ్డిని కూడా పండిస్తారు.

మేము ప్రతి గ్రామంలో ఒక పెద్ద గంట ఉండడం గమనించాం. అత్యవసర పరిస్థితులలో ఉదాహరణకు అగ్ని ప్రమాదం లాంటిది సంభవిస్తే దానిని మ్రోగించి ఇతర గ్రామస్తులని అప్రమత్తం చేస్తారు. అక్కడ సెల్‌ఫోన్లు సరిగ్గా పనిచేయవు కనుక గంటకన్నా మెరుగైన ప్రసార సాధనం లేదని అనిపించింది. అక్కడ మేము చేతితో చేసిన అందమైన కళాకృతులని, చేనేత వస్త్రాలని చూశాము. 'హెన్ పాంగ్ సాంగ్' అనే గ్రామంలో మేము 'పు హెంపావ్ తోతాంగె' అనే వ్యక్తిని కలిశాం. ఆయన మురగబెట్టిన వెదురు వెనిగర్‌తో మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడే మందును తయారు చేశాడు. ఇది వేర్లు, దుంపలు, చెట్ల ఎదుగుదలకి బాగా పని చేస్తుంది. ఇక్కడ 'ధర్మవీర్ కాంభోజ్' అనే ఇన్నోవేటర్ తాను తయారు చేసిన పరికరం ద్వారా స్థానికంగా దొరికే ఉసిరి కాయలతో మిఠాయి చేసి అందరికీ పంచాడు. ఈ విధంగా అక్కడ వారందరికి స్థానికంగా దొరికే వస్తువులతో ఎంతో లాభ పడవచ్చునని తెలియజేస్తూ, ముందుకొచ్చిన వారికి తాను సహాయం చేస్తానని ప్రకటించాడు. అక్కడే మేము 'పు జంగ్ పాల్ హెూకిప్' అనే మూలికా వైద్యుడిని కలిశాం. ఆయన మాకు విరోచనాలు, కీళ్ళనొప్పులు, గాయాలు, మూత్రకోశ వ్యాధులు మొదలైన వాటి నుండి విముక్తిని కలిగించే దాదాపు 25 మూలికలను మాకు చూపించాడు. 'సద్భావ సృష్టి సంశోధన్' ప్రయోగ శాలలో అక్కడినుంచి సేకరించిన మూలికలు, విధానాలపై ప్రయోగాలు జరుగుతున్నాయి. వాటివలన లాభాలు, దాని ఫలితాలు, అవి ఎక్కడినుంచి సేకరించామో వారితో పంచుకుంటాం. 'లేన్ జంగ్' అనే గ్రామంలో పిల్లలు 30–35 రకాల మొక్కలను









తెచ్చి, వాటివలన కలిగే ఉపయోగాలను కూడా చెప్పి మమ్మల్నే ఆశ్చర్య పరిచారు. వాటి పేర్లను వారు స్థానిక భాషలో రాసుకుని రావటం వల్ల వాటిని వేరే భాషల్లోకి తర్జుమా చేయటానికి ఇబ్బంది పడుతూ వుంటే వారే సహాయం చేశారు. స్థానికంగా 'కో చంగ్' (లిల్లియమ్ డిస్టీకం) మొక్కలోని వేరు భాగాన్ని ఎంతో ఇష్టంగా తింటారు ఇక్కడి ప్రజలు. అదేవిధంగా 'మారియో నకోపి' (అలియమ్ ట్యుబ్రోసం అంటే పచ్చి నీరుల్లి – దీనికి వెల్లుల్లి, ఉల్లి కలిసిన రుచి ఉంటుంది) విరివిగా వాడుతారు. దీనిలో కొవ్వును తగ్గించే గుణముందట. మేమిక్కడ చాలా రకాల మిరపకాయలని చూశాం. కుదురువి, పుత్రజనిక తో వీరు రకరకాల పచ్చళ్ళు, ఊరగాయలు చేసుకుంటారు. వీటికి స్థానికంగా మార్కెట్లో మంచి గిరాకీ ఉండటమే కాక, హెచ్చు ధర కూడా పలుకుతోంది. ఈమధ్యకాలంలో ఈ మొక్కకి చీడ తగులుకొని దాదాపు అంతరించి పోతూ వుండటంతో దీనికి మీదగ్గరేదైనా విరుగుడున్నదా అని మమ్మల్ని అడిగారు. ఈ మొక్కకి మంచి ధర పలుకుతుంది కనుక దీనికి పట్టిన చీడకి విరుగుడు దొరికితే ఆ ప్రాంత ప్రజలు బాగు పడతారని చెప్పారు.



'లాంగ్ జంగ్' అనే గ్రామంలో పూర్తి మిలటరీ దుస్తులతో వున్న ఒక పదవీ విరమణ చేసిన సైనికుడ్ని కలిశాం ఆయన పేరు 'సాంగ్ కో జాన్ కుకీ'. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ఆయన బ్రిటీష్ సేనల తరుపున పని చేశారు. ఆయన, ఆయన భార్య 66 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. ఇప్పుడాయన వయస్సు 90 సంవత్సరాల పైచిలుకే. ఇక్కడ మేము ఆలోచనల పోటీ నిర్వహించగా దేశంలోని ఈ మారుమూల ప్రదేశంలో కూడా చాలా చక్కని ఆలోచనలు వచ్చాయి.

మేము 'ఖోతు' అనే గ్రామానికి వెళ్ళాం. నిర్బంధ విద్యాచట్టం అమలులో వున్నా, ఇక్కడ చుట్టుప్రక్కల ఐదారు కిలోమీటర్ల దూరం వరకు బడే లేదు. ఇక్కడి పిల్లలు వారి ఆలోచనలు చెప్పమన్నప్పుడు మాకొక బడి కావాలని అడగటంలో ఏమీ ఆశ్చర్యం లేదనిపించింది. ఈ పరిస్థితులలో ఎవరైనా కొందరు యువకులు ప్రగతికి విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్నారూ అంటే మరి నిజమే అనిపిస్తుంది.

ఇంకొక గ్రామంలో మేమొక చిన్న పిల్ల 'షై గౌలీన్' ని కలిశాం. ఆమె ఆలోచనలు మంచిగా ఉన్నాయి. ఆ అమ్మాయి ప్రపంచాన్ని వేరే దృక్కోణం నుంచి చూస్తోందా అనిపించింది. ఆమె ఆలోచనలకి కొన్ని ఉదాహరణకు రెండు మూతులున్న సీసా, రెండువైపులా కత్తిరించే కత్తెర, వెనక రెండు చక్రాలున్న స్కూటరు మొదలైనవి. ఈమె ఆలోచనలు చూస్తూవుంటే అక్కడ మన టీచర్లు ఈమెను భరిస్తారా అనిపించింది. 'లింగ్ నె వా' చత్వారానికి దానంతట అదే సర్దుకునే కళ్ళద్దాలు ఊహించింది. 'టింగ్ దై' మడత పెట్టడానికి వీలైన పెన్ను డిజైన్ చేయాలనుకుంది. ఇంకొక అమ్మాయి రాత్రిపూట చదువుకోవటానికి వీలుగా కళ్ళద్దాలలో టార్చిలైట్ ఉంటే బావుండునంది. సౌరశక్తితో పనిచేసే

విమానము, మనం గురి చూసింది అద్దాలలో చూపించే తుపాకి మొదలైనవి వీరి ఇతర ఆలోచనలు.

పిల్లలు అందమైన చిత్రాలు చిత్రించారు. 'ఎన్ పెన్‌సాంగ్' గ్రామంలో పిల్లలు వాళ్ళకి కావలసిన గ్రామాన్ని వాళ్ళే డిజైన్ చేశారు. వ్యాన్‌లో ఒక బడి, మందులిచ్చే ఆసుపత్రి, వరుస క్రమంలో ఇళ్ళు ఉన్నాయి. తరువాత వారు జానపద నృత్యం చేసి చూపించటమే కాక మా శోధ యాత్రీకుల చేతకూడా నృత్యం చేసి చూపించారు. పని వత్తిడిలో పడిపోయి నృత్యము, సంగీతము అంటే ఏంటో మర్చిపోయిన మాకు అదెంతో ఆహ్లాదాన్ని కలిగించింది. ప్రాంతీయంగా పరిస్థితులు అల్లకల్లోలంగా వున్నా, అక్కడి ప్రజలు జీవితాన్ని కలిసి పంచుకునే అవకాశాలను వదులుకోవటం లేదు. అన్నీ కలిసే చేస్తూవుంటారు.

ఆ ప్రాంతంలో శుచి, శుభ్రత చాలా బావున్నాయి. ఆర్థికంగా ఎంతో వెనకబడిన ప్రాంతమైనప్పటికి ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నాయి. 'సాంగ్ పీ' గ్రామంలో మేము దానిమ్మ ఆకులతో చేసిన టీ త్రాగాము. 'కోతే' గ్రామంలో స్థానికంగా పాఠశాల లేక చదువుకోవటానికి పిల్లలు దాదాపు ఐదారు కిలోమీటర్ల దూరం రోజూ వెళ్ళి రావలసి వస్తున్నదట. అక్కడి ప్రజలు వారందరినీ కలిపినందుకు మా శోధయాత్రీకులకే ధన్యవాదాలు చెప్పారు. వీడ్కోలు చెప్పిన తర్వాత మాకందరికీ చేతికర్రలు బహూకరించారు. అవే లేకపోతే మేమా పర్వత మార్గాల్లో నడవటమే కాదు, దారి తప్పిపోయే వాళ్ళం. తప్పిపోయాం కూడా. మేము 'లాంగ్ గాంగ్' నుంచి 'పీ సోజల్' గ్రామానికి వెళ్ళలేకపోయేవాళ్ళం. అసలేం జరిగిందంటే మేము దోవ తప్పిపోయి ఆ పర్వత మార్గాల్లో ఎక్కడికి వెళ్ళాలో తెలియని పరిస్థితుల్లో వుండిపోయాం. ఇక్కడ మేము 'నెగ్ లేంగ్ నెయిక్ చాంగ్‌మతే' అనే అమ్మాయికి ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఆమెని అందరూ ప్రేమగా 'చాచున్' అని పిలుస్తారు. ఆమె తన సెల్‌ఫోన్‌లో తప్పిపోయారని ఎస్.ఎం.ఎస్. ఇచ్చింది. 'పీ సోజెల్' గ్రామం వారు మూడు జట్లని అడవిలోకి మమ్మల్ని వెతకమని పంపారు. 12వ తరగతి చదువుతున్న 'హెంగ్ కోట్' గ్రామానికి చెందిన చాచన్ అనే అమ్మాయి మాకు తోడు వచ్చింది. యాత్ర ఆసాంతం ఆమె మాతోనే వుండి ఆ ప్రాంతీయ భాష, సంస్కృతి తెలుసుకోవటానికి ఎంతో తోడ్పడింది.

ఉదయం సమావేశం పూర్తవగానే 'పీసోజెల్' గ్రామస్తులంతా ఒక వరుసగా నిలబడి మా శోధయాత్రీకులతో చేయి కలిపారు. అక్కడి పిల్లలకి ఆలోచనల పోటీలో భూగోళపు నమూనాని బహుమతిగా ఇస్తే వెంటనే వారంతా అందులో తమ ప్రాంతం ఎక్కడుందో వెతకసాగారు.

యాత్రలో చివరి భాగంగా 'తుళుం జంగ్' గ్రామాన్ని సందర్శించాం. అక్కడ మేమొక వడ్రంగిని కలిశాం. ఆయన రూపొందించిన చెక్క శిల్పాలను చెక్కడాన్ని చూశాము. ప్రాంతీయంగా ఎంతో పేరు గడించుకున్న గాయకుడు 'జి.ఎల్. డేవిడ్ మతే' మాకోసం పాటలు పాడారు. ఆయన ప్రస్తుతం ఢిల్లీలో వుంటున్నారట. ఇంకొక గ్రామస్తుడు రెండు ఆకులతో ఒక బూరా కట్టి శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించాడు.

ఈ ప్రాంతంలో పుష్కలంగా వర్షాలు పడినా సరియైన వాననీటి రక్షణ చర్యలు లేకపోవటం వలన ఎప్పుడూ నీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒకచోట మేము నీటితో నడిచే నూర్పిడి యంత్రం వాడటం చూశాము. ఒక వాగులోంచి వచ్చే నీటితో ఈ యంత్రం పనిచేస్తోంది. మాకెందుకో ఆ ప్రాంత ప్రజలు నీటికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు అనిపించింది. కానీ, అడిగితే అటువంటిది ఏమీ లేదని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ నీటి ఫిల్టర్ ఉంది. ఇటువంటి యాత్రలు సంవత్సరానికి రెండుమూడు సార్లు నిర్వహిస్తే హింసలో కూరుకుపోయిన మా సమాజంలోని పిల్లలు స్ఫూర్తి చెంది, సృజనాత్మకత వైపుకి మళ్ళించే అవకాశం వుంటుంది కదా అన్నారు గ్రామస్తులు. మేము అక్కడొక సామాజిక, సృజనాత్మక కేంద్రాన్ని ప్రారంభిద్దామని అనుకుంటున్నాం. ఆ కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన ఇన్నోవేటర్లు ఒక్కచోట చేరి, తమ ఇన్నోవేషన్లనే కాక, ఆలోచనలను కూడా పంచుకొనే అవకాశం వుంటుందని భావిస్తున్నాం.

మనం కొంచెం అర్థం చేసుకొని ప్రేమించాలే కాని, మన పట్టణ వాసులకి మణిపూర్ అనగానే అందమైన చేనేత వస్త్రాలు, వైవిధ్యం కల జీవన విధానం, ఆప్యాయంగా ఆదరించే సంస్కృతి గుర్తుకు రావాలి. ●

# ఔషధ మొక్కలు - ఉపయోగాలు



**ఏడాకుల మొక్క ఉపయోగాలు:**

**గుండె నొప్పికి :** గుండె నొప్పి అనేది చెప్పి రాదు. వచ్చినప్పుడు సరియైన జాగ్రత్తలు తీసుకోకపోతే అది ప్రాణాంతకంగా అయ్యే ప్రమాదముంది. గుండె నొప్పికి ఆంధ్రప్రదేశ్ విశాఖ పట్టణానికి చెందిన 'కోరా మిన్నాన' ఈ క్రింది చిట్కా చెప్తున్నాడు. ఒక చెంచాడు ఏడాకుల చెట్టు బెరడును పొడిగా చేసుకుని నీటితో కలిపి సేవిస్తే చాలునట.



**తలనొప్పికి :** తలనొప్పికి కారణాలేమైనా అది వస్తే మాత్రం భరించడం కష్టం. ఏ పనీ తోచనీయదు. దీనికి జార్ఖండ్ లోని హజారీబాగ్ కి చెందిన 'ప్రిషీలా తద్దూ' ఈ విధమైన చిట్కాను చెప్తున్నాడు. 20 గ్రా. ఏడాకుల చెట్టు బెరడు రసాన్ని త్రాగితే మంచి ఫలితం వుంటుందట.

**కడుపు నొప్పికి :** కడుపు నొప్పి వచ్చినపుడు భరించలేక మనుషులు మెలితిరిగి పోవటం చూస్తూ వుంటాము. అలాంటి సమయంలో 20 గ్రా.20 గ్రా. ఏడాకుల చెట్టు బెరడు రసాన్ని త్రాగితే మంచి ఫలితం వుంటుందని చెప్తున్నారు జార్ఖండ్ లోని హజారీబాగ్ కి చెందిన 'ప్రిషీలా తద్దూ'.

**కడుపులో గ్యాస్ నివారణకు:** ఈ సమస్య బారిన పడని వారు ఎవరూ వుండరు. ప్రతి ఒక్కరూ ఏదో సమయంలో ఇది అనుభవించిన వారే. దీనికై అస్సాంకు చెందిన 'శివ్ సాగర్' ప్రాంత వాసి 'ఇంద్రకాంత్ ఓజా' ఏడాకుల చెట్టు ఆకులను కొన్నింటిని తీసుకొని వాటిలో నల్ల మిరియాలు కలిపి

ముద్దగా నూరి భోజనానికి ముందు కొంత తీసుకుంటే మంచి ఫలితం వుంటుందని అంటున్నారు.

**జ్వరం :** చిన్న పిల్లల దగ్గరనుంచి పెద్దవారి వరకు జ్వరం రావటం అన్నది సహజం. జ్వరం వచ్చినపుడు అది తగ్గటానికి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన 'కోడేరమా' ప్రాంత వాసి 'కుతువా బిర్‌హెూర్ని' 50 గ్రా. ఏడాకుల చెట్టు బెరడుని పొడిగా చేసి నీటితో రోజుకు రెండుసార్లు తీసుకుంటే ఎంతటి జ్వరమైనా తగ్గుముఖం పడుతుందని తెలియజేస్తున్నాడు.

**ప్రాచీన గ్రంథాల్లో ఏడాకుల చెట్టు గురించి చెప్పిన విషయాలు:**

ఏడాకుల చెట్టు బెరడు పొడిని చర్మ సంబంధ వ్యాధుల నుండి విముక్తికి, అలాగే కీళ్ళనొప్పులకి విరుగుడుగా కూడా వాడుతారు. ఈ చెట్టు వేళ్ళ రసాన్ని పాలతో కలిపి తీసుకుంటే కుష్ఠు వ్యాధిని కూడా నివారించవచ్చునట!. క్షయ వ్యాధికి విరుగుడుగా ఏడాకుల చెట్టు బెరడుని నీటిలో మరిగించి ఆ రసాన్ని సేవిస్తే మంచి ఫలితం వుంటుంది. పేగులలో పురుగుల నివారణకు ఈ చెట్టు బెరడు రసాన్ని సేవిస్తే మంచిదట. ఆయుష్-64 మాత్రలు, కాప్స్యూల్స్‌ల తయారీలో ఈ చెట్టు బెరడు పొడినే ఉపయోగిస్తున్నారు. దీనిని మలేరియా జ్వరం వచ్చినపుడు వినియోగిస్తున్నారు. ఏడాకుల చెట్టు బెరడు ఉపయోగానికి సంబంధించిన 15 పేటెంట్లు ఇప్పటికే నమోదై వున్నాయి.

**నేలవేము ఉపయోగాలు:**

**ఎసిడిటీ :** ఈ కాలపు జీవన విధానం కారణంగా ఎసిడిటీ బారిన పడనివారుండరంటే అతిశయోక్తి కాదు. ఈ ఎసిడిటీ నుండి విముక్తి పొందడానికి ఆంధ్రప్రదేశ్ విశాఖ పట్నం నుండి 'కైరంగి బుద్ధు' ఈ చెట్టు కషాయాన్ని తాగితే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నాడు.

**జ్వరం :** జ్వరం రావటం అన్నది సర్వ సహజమైన రోగం. చివరికి వాతావరణం మారినా జ్వరం రావటం కద్దు. జ్వరం వచ్చినపుడు దాన్ని తగ్గించటానికి ఈ పద్ధతి ఉత్తమం అని చెపుతున్నారు బీహార్ రాష్ట్రానికి చెందిన షేక్‌పురా ప్రాంత వాసి 'రామ్‌రతన్ చౌహాన్' ఈ విధంగా చేస్తే మంచిదని చెపుతున్నాడు. రోజుకు రెండుసార్లు మూడు రోజుల పాటు ఈ చెట్టు కషాయాన్ని త్రాగితే చాలునట ఎంతటి జ్వరమైనా తగ్గుముఖం పడుతుందట.



**గ్యాస్ :** ఈ రోజుల్లో మనం తీసుకునే ఆహారం కారణంగా లేదా సమయానికి ఆహారం తీసుకోక పోవటం కారణంగా లేదా ఎక్కువ అహారం తీసుకోవటం కారణంగా గ్యాసుకు సంబంధించిన సమస్యలు వస్తూవుంటాయి. ఈ సమస్య పరిష్కారానికి జార్ఖండ్ లోని హజరీబాగ్ ప్రాంత వాసి 'జయ్‌ధన్ మురిన్'. ఉదయం ఈ చెట్టు రసం ఒక కప్పు సేవిస్తే ఈ గ్యాస్ సమస్యనుండి విముక్తి పొందవచ్చునని చెపుతున్నారు.

**గాయాల చికిత్సకు :** తమిళనాడు నుండి తిర్నెల్‌వెల్లి నివాసి 'అమృదిరాజ్ కన్నయ్' దెబ్బలు తాకినపుడు ఈ విధంగా చేస్తే మంచిదని చెపుతున్నాడు. నేలవేము చెట్టు మొత్తాన్ని కొబ్బరి నూనెలో మరిగించి, ఆ నూనెను వడగట్టి, వడగట్టిన నూనెని దెబ్బలు తాకిన/ గాయాలైన ప్రదేశంలో రాస్తే మంచి ఫలితం వుంటుందని అంటున్నారు.

**చర్మ వ్యాధుల నివారణకు :** చర్మ వ్యాధులకు గురైన వారు ఆ బాధనుండి విముక్తి పొందుటకై మొత్తం చెట్టును పొడిగా చేసి రోజూ ఒక చెంచాడు తీసుకుంటే సరిపోతుందని చెపుతున్నారు పుదుచ్చేరికి చెందిన 'కౌసల్య'.

**ప్రాచీన గ్రంథాల్లో నేలవేము ను గురించి చెప్పిన విషయాలు**

నేలవేము చెట్టు మొత్తం నుండి తీసిన కషాయాన్ని జ్వరం వచ్చినపుడు తాగితే మంచి ఫలితం వుంటుంది. చర్మవ్యాధులకి ఈ చెట్టు రసాన్ని వేడిచేసి వాడితే ఉపయోగకరంగా వుంటుంది. ఈ చెట్టు రసాన్ని మలేరియా జ్వరం వచ్చినపుడు కూడా వాడుతారు. కాలేయ సంబంధ వ్యాధులకి వాడే 'లివ్ అప్' కాప్స్యూల్, 'డిటాక్స్' మాత్రలు ఈ చెట్టు ఆధారంగా తయారు చేసినవే. 'ఆర్థో సోరోసిస్'

మరియు ఇతర వ్యాధుల నివారణకు ఈ నేలవేము చెట్టు ఆధారంగా 14 పేటెంట్లు ఇప్పటికే నమోదై వున్నవి.

**వేప చెట్టు ఉపయోగాలు:**

**చర్మ వ్యాధులు :** వాతావరణ కాలుష్యం వల్లనైతేనేమి, మరే ఇతర కారణాల వల్లనైతేనేమి చర్మవ్యాధులు రావటం సాధారణమైపోతోంది. చర్మ వ్యాధులు వచ్చినపుడు వేప ఆకుల ముద్దను స్థానికంగా పట్టిస్తే మంచి గుణం కనపడుతుందని చెప్తున్నారు ఢిల్లీకి చెందిన 'అనిల్ కుమార్ వన్సాల్'.

**చెవిపోటు :** చెవిపోటు అన్నది పెద్దలకి వచ్చినా, పిల్లల్లో వచ్చినా బాధ విపరీతంగా ఉంటుంది. చెవిపోటు వచ్చినపుడు వేపగింజల నూనెను తేనెలో కలిపి కొన్ని చుక్కలు పోటు వచ్చిన చెవిలో వేస్తే మంచి గుణం కనిపిస్తుందని చెపుతున్నారు బీహార్ రాష్ట్రం లోని తూర్పు చెంపారన్ ప్రాంతవాసి 'రమేష్ కుమార్'.

**కిడ్నీలలో రాళ్ళు :** కొన్ని ఆహార పదార్థాలు తినటం వలన, సరిగా నీరు త్రాగకపోవటం వలన మూత్ర పిండాలలో రాళ్ళు ఏర్పడే అవకాశం వుంది. ఈ వ్యాధికి గురైన వారికే తెలుస్తుంది దాని బాధ. ఈ వ్యాధి బారిన పడినవాళ్ళు వేప ఆకు భస్మాన్ని నీటితో కలిపి తీసుకుంటే మంచి ఫలితం వుందని చెపుతున్నారు రాజస్థాన్ రాష్ట్రం, శిరోహి ప్రాంతానికి చెందిన ఉత్తమ్‌సింగ్.

**కీళ్ళ నొప్పులు :** ఈ కాలంలో పెద్దవాళ్ళకే కాదు, చిన్న పిల్లలకి కూడా కీళ్ళ నొప్పులు వస్తున్నాయి. ఇది వచ్చినపుడు బాధనుండి ఉపశమనం పొందటానికి వేపగింజల నూనెతో నొప్పివున్న ప్రాంతంలో మర్దన చేస్తే మంచి ఉపశమనం వుంటుందని చెప్తున్నారు ఉత్తర ప్రదేశ్ సీతాపూర్ ప్రాంతానికి చెందిన 'జగ్జీత్ బహదూర్'.



**మలబద్ధం :** నవీన జీవన విధానం కారణంగా, తిండి, ప్రయాణ పు అలవాట్ల మూలంగా మనుషులు మలబద్ధం బారిన పడటం జరుగుతూ వుంటుంది. దీనినుండి ఉపశమనం పొందడానికి తమిళనాడుకు చెందిన తిరునల్వేలి ప్రాంతవాసి 'అమృదిరాజ్ కానీ' ఈ విధమైన మిశ్రమాన్ని సూచిస్తున్నారు. కొన్ని నిమ్మ ఆకులను కలబంద, మెంతులు వేసి, బాగా నూరి, దానిని మజ్జిగలో కొంతసేపు నాననిచ్చి, తర్వాత మరగబెట్టాలి. దానిలో ఆవు నెయ్యి కలిపితే అది మైనం మాదిరి గట్టిగా తయారవుతుంది. దీనిని ఒక చెంచాడు రోజూ తీసుకుంటే మలబద్దకం నుంచి ఉపశమనం పొందవచ్చునంటున్నారు అమృదిరాజ్.

**ప్రాచీన గ్రంథాలలో వేప గురించి చెప్పిన వివరాలు:**

ఈ చెట్టు బెరడుని మలేరియా జ్వర చికిత్సలో వాడుతారు. మొత్తం చెట్టుని వివిధ రకాలైన చర్మవ్యాధుల నుండి విముక్తి పొందటానికై వాడుతూ వుంటారు. మొలల నివారణకు ఎండిన వేపగింజలను వాడతారు. చిగుళ్ళ వాపునుండి, దంతక్షయం నుండి నివారణ పొందడానికి ఔషధ గుణం గల 'నీమ్ టూత్ పేస్ట్' ని వాడటం మామూలే. వేపతో చేసిన ఫైలెక్స్ మాత్రలను దీర్ఘకాలంగా వున్న మలబద్ధకాన్ని పోగొట్టటానికి వాడతారు. వేప ఔషధ గుణాల పైన దంత వ్యాధుల నివారణ గుణాలపైన ఆధారపడి 100 పైగా పేటెంటు నమోదై వున్నాయి.

**ఎన్.ఐ.ఎఫ్. ప్రచురించిన 'ఇండియా ఇన్నోవేట్స్' పుస్తకం ఆధారంగా.....**

**సూచన**

'పల్లెసృజన'లో ప్రచురింపబడ్డ ఆవిష్కరణ లు, పరిష్కారాలు, సాంప్రదాయ జ్ఞానం అమలు చేసిన మీ అనుభవాలను మాతో పంచుకుంటే 'పల్లెసృజన' లో ప్రచురిస్తాం. అలాగే ఆవిష్కర్తకు/ జ్ఞానకర్తలకు మీ అభిప్రాయాలను ధన్యవాదాలతో అందజేస్తాం.

– ఎడిటర్

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పం, పల్లె వీరరాఘవ రెడ్డి లాంటి అంకిత భావంతో పనిచేసే వ్యక్తుల సహకారంతో ఈ సంస్థను మన రాష్ట్రంలో స్థాపించడమైనది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి ఊపునందుకొంది. 2010లో శ్రీ జమ్మలమడక శశిమోహన్, శ్రీకర్ గార్ల ఆగమనంతో ప్రభుత్వ సంస్థలతో హనీబీఏపి అనుసంధానం ఇంకా బాగా పుంజుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ ఎనిమిదేళ్ళలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

- 106 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.
- ఇప్పటి వరకు 18 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.
- పంతొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఇన్నోవేషన్లను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.
- దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.
- 'పల్లెసృజన' ద్వారా గుంటూరు జిల్లావాసి సయ్యద్ సుభాని సృష్టించిన 'బూమ్ స్ప్రేయర్'ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు 2012లో రికార్డుగా నమోదు చేయడమైనది.
- అయిదవ జాతీయ పోటీల్లో బోయ రాజన్న, భూమయ్యచారి, నజీర్ అహమ్మద్‌లకు జాతీయ బహుమతులు మార్చి 2012లో రాష్ట్రపతి ద్వారా ప్రదానం.
- గోదాసు నర్సింహ గుర్రపుడెక్క యంత్రాన్ని ఉపయోగించ డానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ముందుకు రావడం, 80 లక్షల రూపాయల ఆర్డరు ఇవ్వడం.
- మల్లేశానికి నాబార్డ్ వారి 2012 జాతీయ అవార్డుతో పాటు నగదు పురస్కారం లభించడం.
- "సివిల్ సొసైటీ హాల్ ఆఫ్ ఫేం" వారు 2011లో చింతకింది మల్లేశాన్ని, 2012లో పశువైద్యంలో చేసిన గ్రామీణ సేవలకు గుర్తింపుగా బోయ పెద్ద రాజన్నను ఎంపిక చేయటం.
- దేశ వ్యాప్తంగా జరిగిన 'శ్యాంసంగ్ ఇన్నోవేషన్ల పోటీ'లలో చింతకింది మల్లేశం, తొండపి గురవయ్యలకు జాతీయ బహుమతులు, నగదు, 2011, 2012లో లభించడం.
- నవంబర్, 2012లో భారత రాజధాని ఢిల్లీలో జరిగిన 'అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన'లో 'బొమ్మగాని మల్లేష్' ప్రదర్శించిన ఇన్నోవేషన్లకు మంచి స్పందన లభించినది.
- 'చైనా'లో డిసెంబర్, 2012లో జరిగిన 2వ అంతర్జాతీయ పునాదిస్థాయి ఇన్నోవేటర్ల సదస్సులో 'చింతకింది మల్లేశం' అతిథిగా పాల్గొన్నాడు.
- 2013 మార్చిలో రాష్ట్రపతి ద్వారా గల్లా చంద్రశేఖర్, బోయ పెద్ద రాజన్న, బొమ్మగాని మల్లేశ్‌లు రాష్ట్రపతి భవనంలో జాతీయ బహుమతులు పొందడం.
- 2013 మే నెలలో ప్రప్రథమంగా 'ఆంధ్రప్రదేశ్ మూలికా వైద్యుల సమావేశం' జరపడం.
- 2011 నుండి ఇప్పటివరకు ఏడు చిన్న శోధయాత్రలు వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించడం.

**మా కలలు :** తొమ్మిదవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం. కనీసం ఆరుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం. పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం. 'పల్లెసృజన' సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

- **బ్రిగేడియర్ పి. గణేశం,** కో-ఆర్డినేటర్, హనీబీఏపి, ఫోన్ : 98660 01678.

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్
# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

## సూది పిచ్చి

- జలుబుకు సూది, దగ్గుకు సూది, తలనొప్పికి సూది, కడుపునొప్పికి సూది, విరేచనాలకు సూది, విరేచనాలు కాకున్నా సూది, పిల్లలు ఏడ్చినా సూది, పిల్లలు నవ్వినా సూది!!! కావంటున్నారు ప్రజలు.
- ఇంజక్షను లేనిదే ఏ జబ్బుకు వైద్యం లేదనేది నేటి సమాజ పోకడ!
- రోగులు కావాలంటున్నారు కాబట్టి సూదులు వేస్తున్నామంటారు డాక్టర్లు. డాక్టర్లు సూదులు వేస్తున్నారు కాబట్టి మేము వేయించుకుంటున్నాము అంటున్నారు ప్రజలు.
- "ఇప్పుడు మనం వేయించుకునే సూదుల్లో 90 శాతం అవసరం లేదు" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంటుంది.
- జబ్బు ఒకటే అయినా– పేదలు ఎక్కువ సూదులు వేయించుకుంటున్నారు! ధనవంతులు తక్కువ సూదులు వేయించుకుంటున్నారు!.
- ప్రజలలో "సూదిపిచ్చి" పెరగటానికి కారణం వైద్యం చేసే వారే అని ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చింది.
- సూదులవల్ల గాయాలు, జబ్బులు, మరణాలు జరగవచ్చు.
- "సూదిపిచ్చి" అన్ని దేశాలలో ఉంది.
- బడుగు దేశాల్లో, గ్రామాల్లో, మురికివాడల్లోని ప్రజలలో, పేదవారిలో సూది పిచ్చి ఎక్కువట!
- డాక్టర్లను సూది వేస్తానంటే – ఒకసారి వీలైతే సూది లేకుండా వైద్యం చేయమని కోరండి.
- సూది వేయని డాక్టరు అసమర్థుడు అనుకోకండి.
- సూదిపిచ్చికి గుడ్‌బై చెప్పండి. సూది ప్రమాదాల నుండి రక్షణ పొందండి.

## తట్టువ్యాధి జాగ్రత్తలు

- చిన్న పిల్లల్లో ఎక్కువగా మరణాలు కలిగించే వ్యాధులలో తట్టువ్యాధి ఒకటి.
- తట్టువ్యాధి ప్యారామిక్సో వైరస్ వల్ల వస్తుంది. తట్టువ్యాధి అంటువ్యాధి.
- తీవ్రమైన జ్వరం, ముక్కు కారడం, కళ్ళనుండి నీరు కారడం, శరీరమంతా పొంగు, నోటిలో పుండ్లు తట్టువ్యాధి లక్షణాలు.
- ఆహారలోపం ఉండే పిల్లలలో ఈ వ్యాధి తీవ్రంగా వుంటుంది.
- తట్టువ్యాధికి ప్రత్యేక మందులు లేవు. పిల్లలకు తగినంత ఆహారం, నీరు, విశ్రాంతి, జ్వరం తగ్గించే చర్యలు చేయాలి.
- తట్టువ్యాధిలో న్యుమోనియా, మెదడువాపు, విరేచనాలు రావచ్చు. వారికి తత్సంబంధిత వైద్యం చేయించాలి.
- విటమిన్ 'ఎ' తట్టువ్యాధి తీవ్రతను తగ్గిస్తుంది. ప్రభుత్వం ఇచ్చే శక్తివంతమైన విటమిన్ 'ఎ' పిల్లలకు క్రమం తప్పకుండా ఇప్పించండి.
- ఒకసారి తట్టువ్యాధి వస్తే, మరల జీవితాంతం రాదు.
- సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో తట్టువ్యాధికి టీకా ఉంది. తొమ్మిది నెలలు పూర్తి అయిన పిల్లలకు మొదటి మోతాదు, 15వ నెలలో రెండవ మోతాదు ఇప్పించండి.

ఈ అంశాలు ఒక నోటుపుస్తకంలో రాసిపెట్టండి, మీస్నేహితులతో, బంధువులతో,సహచరులతో మాట్లాడండి. వారికి పోస్టుకార్డులపై రాసి తెలపండి. **సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ..**

– డా. అరవీటి రామ యోగయ్య, ఓపియస్‌డిహెచ్., ఫోన్ : 98496 69282

# స్పందన

బ్రిగేడియర్ గారికి,

ఆలోచనలను ఆచరణలో పెట్టి ప్రజలకు ఉపయోగపడే, సామాన్యుల తెలివి తేటలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు, ఉపయోగించటం అనే విషయాలను ఆలోచించటంతో ఆపకుండా ఆచరణతో చేస్తూ, సంస్థలను, ప్రజలను భాగస్వాములుగా కలుపుకుంటూ ముందుకు సాగే మీ విధానం నాకొక గట్టి కొమ్మ దొరికిందని కలిగిన ఆనందాన్ని మాటలతో చెప్పలేనిది. వెంటనే మీ ఫొటో కత్తిరించి వివేకానందుడి ఇన్‌స్పిరేషన్‌తో పెద్ద వాల్ పోస్టుమీద ఇంట్లో అతికించాను. ఎన్నో సంవత్సరాలుగా మదిని తొలుస్తున్న బాధకి మందు దొరికినట్లయింది.

మా కుటుంబంలో ఒక మందు తయారు చేస్తాము. అది చర్మం మీద అన్ని రకాల గాయాలు, గడ్డలు, మొలలు, భగ రంధ్రాలు (పిస్టులా), చెవి దురదలు, పండ్లపోటులు, గుల్లలు ముఖ్యంగా కాలిన గాయాలు, పాత పుళ్ళు, మెడిమె సూలలు లాంటి పుళ్ళతో పాటు నవరంధ్రాలలో ఏ బాధనైనా మాన్పించగలదు. బాధలో వున్నవాళ్ళను చూచి వాళ్ళు అడగక పోయినా మందు చేసి ఇస్తున్నాము. ఇది మా నాయనమ్మ గారినుంచి వారసత్వంగా మా కుటుంబంలో అందరికి ఈ మందు చేయటం వచ్చింది.

ముఖ్యంగా వ్రాయటం ఏమిటంటే ఇది ఇంకా ఎక్కువ మందికి ఉపయోగ పడటం లేదని నాబాధ. ఇంకా బాగా వళ్ళు (శరీరం) కాలిన వారు 5 – 6 రోజుల వరకు బతికి చనిపోతున్నారు. అలాగే సైనికులకు కూడా తుపాకి దెబ్బలు, బాంబుల వల్ల కాలిన గాయాలు, కుళ్ళి మరణించడం తెలిసిందే. ఈ మందు మీ ద్వారా మిలటరీకి, కాలిన గాయాల వారికి ఉపయోగ పడాలని ఆశ. దినుసులు (మందు తయారు చేయటానికి) ఎంత కావాలన్నా దొరికేవే. మీరు అవకాశమిస్తే పూర్తి వివరాలు చర్చించటానికి నేను సిద్ధం. మీ యజ్ఞంలో ఒక గడ్డిపోచగా.... **- గుమ్మడి మాధవరావు చౌదరి,** కానూరు, విజయవాడ. ఫోన్ : 94404 87924.

**శ్రీ మాధవరావు చౌదరి గారికి,**

**మీ సహృదయతే మా కార్యక్రమాలను, ఉద్దేశ్యాలను మీకు నచ్చేలా చేసింది. మీ మంచి వాక్యాలకు మా కృతజ్ఞతలు, ప్రోత్సాహానికి ధన్యవాదాలు. సాంప్రదాయ జ్ఞానాన్ని పదిమందికి పంచాలన్న మా తపన మీకు అవగతమైంది. మీతో వివరంగా చర్చించే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాం. వీలైతే హైదరాబాద్‌కు వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయానికి విచ్చేయండి. త్వరలో మీతో సంప్రదిస్తాం.** **-ఎడిటర్**

శ్రీ గణేశం గారికి,

ఈనాడు అనుబంధంలో మీగురించి చదివాక మీ ఎదురీతను సమర్థించకుండా వుండలేను. గాంధీగిరి 'గ్రామీణాభివృద్ధి' ఆశయాలను మర్చిపోయి విదేశీ ఆర్థిక, సామాజిక నమూనాలతో అభివృద్ధి పేరిట జీవనాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్న ప్రస్తుత వ్యవస్థకు మీబోటి వారు గ్రామాలలో వికాసం తెలివితేటలు వున్నాయని నిరూపిస్తున్నారు. 60 సంవత్సరాలు దానిటా స్వాతంత్ర్యం వచ్చిందనే భావన గ్రామ ప్రజలలో ఇంకా రాలేదు. వారి పరిస్థితి దిగజారి ప్రభుత్వ వాగ్దానాలతో జీవించాల్సి వస్తోంది. గ్రామాలలో వారి ఆలోచనలు (నేటివ్ విజ్‌డమ్), వెలికితీసి సహాయం అందించే కొద్దిమందికి పాశ్చాత్య దేశాల ప్రచారానికి లోబడి బానిస ధోరణులు (కమర్షియల్ హ్యాంగోవర్), మనలోని తెలివితేటలమీద మనకే ఆత్మవిశ్వాసం తగ్గింది.

మీరు జరిపే చిన్న శోధయాత్రలు చదువుకున్నవారికి, పాలసీ మేకర్స్ కనువిప్పు కలిగించాలి. మీరు చేపట్టిన కార్యక్రమాల్లో విజయవంతంగా ముందున్న 'ఆసు మిషన్' చేనేత కార్మికుల కష్టాలు చాలావరకు తగ్గించవచ్చు. ప్రభుత్వ నిర్ణయాల ద్వారా అమ్మకాలు జరిగితేగాని వారి జీవనం బాగుపడదు. 'ఆసు మిషన్' చేనేత కుటుంబాలకు ఇవ్వాలన్న సంకల్పం మంచిది. నేను చేతనయినంతవరకు సహాయాన్ని అందిస్తాను. మీ కార్యక్రమం పంపగలరు. మీ 'శోధయాత్ర'లో గ్రామీణ ప్రాంతంలో వైద్య పరిస్థితి కూడా గమనించగలరు. విద్య, వైద్యం సామాన్యులకి అందకుండా పోయినాయి. సామాన్యులకి అందించే ఒక నమూనాను, దానికి సేవాభావంతో పనిచేసే యువకులు, విశ్రాంత ఉద్యోగులు ప్రతి జిల్లాలో వుంటే మీ సంస్థ మౌలిక సదుపాయాలు కల్పించడానికి సహాయం చేయవచ్చు. గ్రామ పెద్దలు ముందుకు వచ్చి సహాయం చేయటం మన సంస్కృతిలో ఎప్పుడూ వున్నదే. ఇదేవిధంగా 'వైద్యం ఖర్చులు' తగ్గించటానికి 'లోకాస్ట్ హెల్త్‌కేర్' ఎంతవరకు అమలు చేయగలరో ఆలోచించగలరు. నాకు తెలిసిన సమాచాం పంపుతున్నాను. 'శోధయాత్ర'లో ఎప్పుడైనా పాల్గొనే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నాను. 'ఎల్లప్పుడూ మీ విజయాన్ని కోరుతూ'..... గౌరవంతో.. **– ఆయ నరసింహం,** బెంగుళూరు, ఫోన్ : 080–25526331.

**శ్రీ నరసింహం గారూ,**

**సమాజంలో జరుగుతున్న అస్తవ్యస్థలపై మీకెంత లోతైన అవగాహన ఉందో మీ ఉత్తరంలో స్పష్టంగా కనిపిస్తుంది. మీ మనసులోని భావాల్ని మాతో పంచుకున్నందుకు కృతజ్ఞతలు. పల్లెసృజన చేపట్టే చిన్నశోధయాత్రలు, మిగతా కార్యక్రమాలు**

www.pallesrujana.org వెబ్‌సైట్‌లో మీరు చూడగలరు. నమస్సులతో.

**– ఎడిటర్**

బ్రిగేడియర్ గణేశం గారికి,

పాతిబండ్ల లీలావతి నమస్కారములతో రాయునది. పల్లెసృజనలో రాసేవన్నీ ఎంతో బాగున్నవి. జీవితంమీద కొత్త ఉత్సాహం, ఆశలు పుడుతున్నవి. ఇంకోవిషయం... గుంటక కృష్ణారెడ్డి గారు దానిమ్మ అంటుకట్టే పద్ధతి రాశారు. అయిదే దానికోసం సముద్రపు నాచు పెడతారని రాసారు. నాచు అక్కరలేదు అదే కొమ్మకి అదే స్థలంలో కొంచెం క్రాసుగా చిన్న గాటు పెట్టి దానికి ఒక పెద్ద గుప్పెడు మట్టి ముద్దలాగా చేసి దానిచుట్టూ పెట్టాలి. దానికి ఒక కాటన్ బట్ట నిండుగా మూసి నాలుగు చుట్లు తిప్పి చివరన గట్టి దారం చుట్టి ముడి వేయాలి. దానీమీద గోగునార పట్టా (గోనపట్ట) చుట్టి ముడివేయాలి. రోజూ కాసిన నీళ్ళు చల్లితే చాలు 40–50 రోజుల్లో దాని నిండా వేర్లు బైటకొచ్చేస్తవి.

ఈ విషయం నాకెలా తెలుసంటే రామగుండంలోని మా అమ్మాయి ఇంట్లో ఒక దానిమ్మ చెట్టు వుండేది. దాని కాయలు పైతోలు ఎంతో పలచగా వుండేది. లేత కాయలైనా తేలికగా రసం వచ్చేది. ఎలాగైనా దాన్ని తీసుకొచ్చి హైదరాబాదులో ప్రముఖులెవరికైనా కుండీలో పెట్టి కాయలున్న చెట్టు ఇవ్వాలనుకున్నాను. గోడమీద కుండీ పెట్టి అంటు కన్నాలనుకుంటే వీలు పడలా. కొమ్మ వంగలేదు. ఏమిచేయాలా అనుకుని అలోచించి కొమ్మకే మట్టి కడదాం అనుకున్నా. మట్టి కారకుండా గుడ్డ చుట్టి తేమ ఆరకుండా నారసంచి చుట్టాను. చాలావేర్లు వచ్చినవి. కత్తిరించి, హైదరాబాద్ తెచ్చాను గాని నేను ఊర్లు తిరగడం హడావిడిలో పడి ఆ విషయమే మర్చిపోయాను. ఇప్పుడు గత సంచికలో కృష్ణారెడ్డిగారి వ్యాసం చదివాక గుర్తుకు వచ్చింది. నాకు తెలిసింది చెప్పానే కానీ, కృష్ణారెడ్డిగారి మీద వేరే అభిప్రాయం కాదు. ఆయన చేస్తున్న పద్ధతిలో ఎన్ని మంచి ఫలితాలున్నాయో నాకు తెలియవు కదా!

**– పాతిబండ్ల లీలావతి,** హైదరాబాద్.

శ్రీమతి లీలావతి గారు,

**మీరు శ్రమతో వ్రాసిన స్పందనకు మా ధన్యవాదములు. మీ అనుభవంతో ఇచ్చిన సలహా మాకెంతో విలువైంది.**


## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | |
|---|---|
| 1. Place of publication | : Ranga Reddy Dist |
| 2. Periodicity of its publication | : Bi-Monthly |
| 3. Printer's Name | : Narendra Grafix |
| Nationality | : Indian |
| Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. Publisher's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. Editor's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Signature of Publisher

Compassion

# హనీబీ నెట్ వర్క్
# The Honey Bee Network

పేరులేని, అనామకులైన ఇన్నోవేటర్లుగాని,
సాంప్రదాయ జ్ఞానం కలవారుగాని,
'హనీబీ నెట్‌వర్క్' పరిధిలోకి వస్తే
గుర్తింపు తెచ్చుకుంటారు.

A nameless, faceless innovator or traditional knowledge holder comes in contact with the Network and gets an identity

www.honeybee.org

Collaboration

Creation

PALLESRUJANA Telugu Bi-monthly ₹ 20/- May-June 2013 RNI No. APTEL 12136/01/1/2011-TC


# పల్లెసృజన


## పాత సంచికలు కావాలా?


**ఒక్కో సంచిక రూ. 25/-లు మాత్రమే**



















**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 600/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 1,000/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 1,500/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 2,600/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866001678
E-mail : editor@pallesrujana.org, Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమచేయండి
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, **Syndicate Bank, Sainikpuri,** Secunderabad
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Graphics, Hyd. Ph. : 81257 99904